ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

57350

నవంబర్ 16, 2008

జంతు జూదం

హ్యాపీబర్త్‌డే

(2008 నవంబర్-16 నుంచి
2008 నవంబర్-22 వరకు)

చింటు
2సం॥, నవంబర్-17
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

వై. వేణు
7సం॥, నవంబర్-22
యాదమ్మ-ముత్యాలు
ఆమన్‌గల్-మ॥నగర్

సి. సందీప్
10సం॥, నవంబర్-1998
పద్మావతి-రామచంద్రారెడ్డి
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

హర్షిణి సాయి శివాని(హనీ)
5సం॥, నవంబర్-2003
జయలక్ష్మి-సుబ్బారావు
మధురీనగర్-విశాఖపట్నం

పి. భావేష్
2సం॥, నవంబర్-2006
లావణ్య-శేఖర్‌బాబు
మియాపూర్-హైదరాబాద్

బి. నాగబాబు
నవంబర్
విజయలక్ష్మి-వెంకటేశ్వర్లు
తునికిపాడు-కృష్ణా

దర్పణ్ జైశ్వాల్
7సం॥, నవంబర్-18
సీమ-ధర్మేష్
గౌలిగూడ-హైదరాబాద్

సిహెచ్.లోకేష్
3సం॥, నవంబర్-15
నాగమణి-కుటుంబరావు
చిన్నమునగాల-ఖమ్మం

డి. శివదుర్గాప్రసాద్
6సం॥, నవంబర్-19
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అంటించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివారాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

రాజకీయ కారాగారాలు

ఇంటికంటె గుడిపదిలం. జైలు పక్షులకు జైలే పదిలం. ఎన్ని సినిమాల్లో మనం చూడలేదు. జైలు పక్షులు జైలును ఎంతగా ప్రేమిస్తాయో మళ్లీ మళ్లీ అక్కడికే చేరాలని ఎంతగా ఆరాటపడిపోతాయో. ఏ గూటి పక్షులు ఆ గూటకే చేరతాయన్న మాట జైలు పక్షులకు వర్తిస్తుంది. దీన్ని కేవలం హాస్యంగా కొట్టేయలేం. ఫ్యాక్షన్ ఘర్షణల్లో, హత్యాకాండల్లో ప్రమేయమున్న వాళ్లు కూడా జైలుగోడలే తమకు శ్రీరామరక్ష అని భావించిన ఉదంతాలు బోలెడు. ప్రత్యర్థుల వేటకొడవళ్లు, నాటుబాంబులు అక్కడికి చేరలేవని వారి భరోసా. బతికుంటే బలుసాకయినా తినవచ్చునన్నట్లు కారాగారంలో ఉంటే ప్రాణాలయినా నిలుపుకోవచ్చని భావించడం కద్దు. కొండకచో పోలీసులు కూడా ఫ్యాక్షనిస్టులకు అదే సలహాపడేస్తారు. బయట ఉంటే నీ ఆయువుకు మేము గ్యారంటీ ఇవ్వలేము స్వామీ... జైలుకు దయచేయండి అని స్వాగతగీతం పాడతారు. బతుక్కి అభయమే కాదు సాగించుకునేవాడికి జైలే స్వర్గం. సర్వసౌకర్యాలకు అవకాశాలుంటాయక్కడ. డబ్బు, రాజకీయ అండ ఉంటే మన జైళ్లలోనూ దొరకనిదంటూ ఏదీ లేదు. జైళ్లలో ఉంటూనే బయటి వ్యవహారాలు చక్కబెట్టవచ్చు. లోపల ఉండే ముఠాలను నడపొచ్చు. హత్యలకు ప్రణాళికలు వేయవచ్చు. అమలు జరిగేట్లు చూడవచ్చు. మన జైళ్లలో కొందరు ఖైదీలు ఖైదీలే కాదు వారే అధికారులు. నిజమైన ఖైదీలు పాపం కింది స్థాయి పోలీసులే. అందుకే అనంతపురం జిల్లా జైలు నుండి ఫలానా ఘరానా ఖైదీలనయినా బదిలీ చేయండి లేదంటే మమ్మల్నయినా బదిలీ చేయండి అని అక్కడి పోలీసులు బహిరంగంగా టీవీ కెమెరాల ముందు కొన్నాళ్లక్రితం మొరపెట్టుకొన్నారుమరి. ఘరానా ఖైదీలు అక్కడ స్వేచ్ఛగా ఏదైనా చేస్తారు. వారు ఎవరితోనయినా మాట్లాడతారు. సెల్‌ఫోన్లు వారి సేవలకు ఎల్లవేళలా సిద్ధం. అలాగని ఎవరు బడితే వారు ఖైదీలతో మాట్లాడడానికి వీలు లేదు. చర్లపల్లిలో ఏం జరిగిందో మనం గమనించాలి. విఐపితో పాటు జైలును సందర్శించిన జర్నలిస్టుల్లో ఒకరు ఒక ఖైదీతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. పాపం ఆ విలేకరికి తాను ఘరానా కేటగిరి కిందకి రానని తెలియదులా ఉంది. జైలు అధికారులకు వెంటనే రూల్స్ గుర్తుకొచ్చి చెర్రెత్తింది. ఆ విలేకరిని పట్టుకొని చితక్కొట్టేశారు. అదేమిటో గానీ అనంతపురం జైల్లో మాత్రం పోలీసులకు ఈ పట్టింపులేవీ లేనట్టున్నాయి. మొద్దుశ్రీనును హత్య చేసిన ఓంప్రకాశ్‌ను చూసేదాకా తెలుగుదేశం నాయకులను వదలిపెట్టలేదు. కాదుకూడదంటే ఇక్కడ కూడా ప్రతిపక్షనాయకులకు దండన తప్పేది కాదేమో అదలా ఉంచుదాం. పోలీసులు చెప్పిన ప్రకారం ఓంప్రక్రాశ్ పరమసాధువు. రోజూ రామకోటి రాసుకొనేవాడు. డాక్టర్లు తేల్చిన దాని ప్రకారం ఆయన మానసిక స్థితి బాగానే ఉంది. అయినా పిచ్చి కోపంతో మొద్దు శ్రీనును చంపేశాడు. చంపేయడమంటే అదేదో విజయం సాధించినట్లు రెండువేళ్లు చూపెట్టాడు. ఆ రెండు వేళ్లను పట్టుకొని మన సచివోత్తములు తమ చూపుడువేలు చంద్రబాబు వైపు తిప్పారు. పరిటాల రవీంద్రను చంపింది తానేనని మొద్దుశ్రీను ఆనాడు గొప్పగా టీవీ కెమెరాల ముందు చెప్పాడు. ఓంప్రకాశ్ కూడా అంతే సంతోషంతో మొద్దుశ్రీనును చంపినట్లు చెప్పుకొంటున్నాడు. రెండు హత్యలు క్షణికావేశంతో జరిగిన హత్యలు కావని స్పష్టంగానే తెలుస్తోంది. నేరం అంగీకరించినప్పటికీ పరిటాల రవిని హత్య చేయడానికి ఆయుధాలు ఎలా సమకూర్చుకొన్నారు? ఒప్పందం ఏమిటి? అన్నది వెల్లడి కావాల్సిన దశలో మొద్దుశ్రీనును హత్య చేశారు. ఈ కేసులో సంబంధమున్న మరో ఇద్దరు ఇంతకుముందే హత్యకు గురయ్యారు. అయినాసరే మన అమాత్యులంతా కట్టకట్టుకొని మొద్దుశ్రీను హత్యకు తెలుగుదేశమే కారణమని, జనమంతా దాన్ని నమ్మాలని కోరుతున్నారు. మొత్తానికి రాజకీయ నయగారాలు బయటికన్నా జైల్లోనే మహబాగా వర్ధిల్లుతున్నాయని అర్థమౌతుంది. సో వాటిని కారాగారాలు అనే బదులుగా రాజకీయ గారాలు అంటే బెటరేమో!

ఈ సంచికలో....

టపా	...	2
బాలవికాసం	...	3
మంచిపుస్తకాలు	...	4
కథ	...	6
ఆరోగ్యం	...	8
రుచి	...	11
బాలనేస్తాలు	...	13
అట్టమీది కథ	...	17
చూద్దామా	...	21
మనసా... తెలుసా	...	26
కొత్తపుస్తకాలు	...	27
క్రైమ్ స్టోరీ	...	28

ఇంకా...

కవిత్వమ్... 10

పెరడు దాటని పికాసో

తెలుసుకుందామా...12

ఇఎంఎస్ అకాడమీ విశిష్టత

సినిమా కబుర్లు ... 24

ఎవరి మాట వినను

అట్టమీది కథ విపులంగా వుంది

వైట్ హౌస్‌లో ఒబామాపై ఎమ్.కోటేశ్వరరావుగారు చాలా చక్కగా రాశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల లొసుగులను విపులంగా రాశారు. మనకున్నదే బూటకపు ప్రజాస్వామ్యమని నేననుకున్నా. అమెరికా అసత్యపు ప్రచారంలో అందె వేసిన చెయ్యి. అమెరికా ఎన్నికల ప్రచారంలో అసత్యానిదే అగ్ర తాంబూలం. బూర్జువా పార్టీలు ఎచటనున్నా వాటివి అమలు కాని వాగ్దానాలు. సంపన్నులకు మేలు చేయటం, పేదలకు కీడు తలపెట్టడమే వాటి నైజం. అమెరికా అధ్యక్షునిగా నల్లవాడొచ్చినా, తెల్లవాడొచ్చినా దేశ పాలనలో మార్పు ఉండదు. ఆ దేశపాలకుల పుణ్యమా అని ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. నేటి భారత పాలకులు ఆ దేశంతో జత కడుతున్నారు. వామ పక్షాలు వద్దని ఎంత మొత్తుకున్నా పాలకులు పెడ చెవిన పెట్టారు.

గోలి నరసింహరాజు.

పలు అంశాలు తెలిశాయి

ఇప్పుడు ప్రపంచమంతా ఎదురు చూసిన అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికకు సంబంధించి అట్టమీది కథ ఇవ్వడం బావుంది. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా అధ్యక్ష పదవికి ఎన్నికయ్యే అవకాశం ఉందన్న అంశంతో పాటు పలు అంశాలు కవర్ స్టోరీ ద్వారా తెలుసుకున్నాం.

టి. శ్రీరామమూర్తి,గాజువాక.

బైలకుప్పే విశేషాలు తెలుసుకున్నాం

అమెరికా ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అక్రమాలను గురించి అప్రజాస్వామికమైన పరిస్థితులను గురించి కవర్ స్టోరీ ద్వారా ఎన్నో విషయాలను తెలుసుకోగలిగాం. ప్రపంచ రాజకీయాలలో పెద్దన్న పాత్ర పోషించే అమెరికాలో ఎన్నికల ప్రక్రియ ఇంత అధ్వాన్నంగా ఉండటం ఆశ్చర్యం కల్గించింది. అమెరికాలో అధ్వాన్న ఎన్నికల ప్రక్రియ గురించి, నాయకుల దిగజారుడు తనం గురించి ఏ వార్తా పత్రికలోనూ వివరించని ఎన్నో కొత్త విషయాలను ఈ కవర్ స్టోరీ ద్వారా పాఠకులు తెలుసుకోవడానికి వీలయింది. అలాగే కర్ణాటకలోని టిబెట్‌ను తలపించే గ్రామమైన బైలకుప్పే విశేషాలను గురించి చూద్దామా.. శీర్షికలో చదివి తెలుసుకున్నాం. థైరాయిడ్ సమస్యలు రావడానికి గల కారణాలను, రోగ నిర్ధారణతో పాటు మందులు మరియు చికిత్సా విధానాలను ఆరోగ్యం శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. అరుదైన వ్యక్తిత్వం కలిగిన మన మహాత్ముడిపై వచ్చిన వివిధ సినిమా విశేషాలను గురించి లాహిరి లాహిరిలో చదివి ఆనందించాం.

జి. సురేష్, సీతారాంపురం.

పిచ్చుక... తీపి జ్ఞాపకాలు

నవంబర్ 2 స్నేహలో పిచ్చుక పునరాగమనం అంటూ పిచ్చుకలు మనతో చేసిన స్నేహాన్ని , తీపి జ్ఞాపకాలను గుర్తు చేసింది. మన ఇళ్లలో, వాసాలలో, పెంకులలో, వాకిళ్లలో గోలగోల చేస్తున్న పిచ్చుకలు కొన్నాళ్లు అదృశ్యమై మరలా మన కళ్లకు ప్రత్యక్షమైనట్లు తెలియ జేసిన తీరు బాగుంది. 'థైరాయిడ్ సమస్యలు నివారణా మార్గాలు' శీర్షిక మాకు మంచి అవగాహన కలగజేసింది. హైపర్ థైరాయిడ్ వ్యక్తిగత కుటుంబ చరిత్ర, లక్షణాలు, చికిత్స చేయటం నివారణ ఎలా అన్న అంశాలను చాలా చక్కగా విపులంగా అందించిన డాక్టర్ కె.శ్రీకాంత్‌గారికి నమస్సులు. నాకూ స్వంత భావాలున్నాయంటూ శృతి కమల్ హాసన్ చెప్పిన ముచ్చట్లు బాగున్నాయి. రుచిలో ప్రచురించిన వంటకాలు మమ్ములను మైమరపింప జేస్తున్నాయి. మన స్నేహలో చిన్నపిల్లల కొరకు అందిస్తున్న బాల నేస్తాలు, కలం స్నేహం, హ్యాపీబర్త్‌డే చూడముచ్చటగా ఉంటున్నాయని చెప్పటంలో ఏ మాత్రం సందేహంలేదు. పిల్లల కొరకు ప్రతివారం ప్రచురిస్తున్న బాలనేస్తాలు బాగుంటోంది. అట్టమీది కథ చదివాం. అభివృద్ధిలో అమెరికానే ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉంది. అంతరిక్ష ఉపగ్రహాల ద్వారా పడక గదుల్లోకి సైతం చూడగల సామర్థ్యం సంపాదించింది. దొంగ ఓట్లు వేయకుండా నిరోధించే ఎన్నికల విధానాన్ని రూపొందించటంలో మాత్రం ఘోరంగా విఫలమైందంటూ వైట్ హౌస్‌లో ఒబామా అంటూ కోటేశ్వరరావుగారు చలా చక్కగా వివరించారు. ఓ మంచి పుస్తకంలో 'అవినీతి పడగనీడ, అంతర్జాతీయ సంస్థల క్రీడ' అంటూ సమీక్షను కొనసాగించిన విధానం బాగుంది. చక్కని అంశాలతో ప్రతివారం మాతో ముచ్చటిస్తున్న స్నేహకు నాహృదయపూర్వక శు భాభివందనాలు.

కర్రా వరప్రసాద్,యలమర్రు.

పిచ్చుక మాట బావుంది

ఆదివారం వ్యాఖ్యగా వచ్చిన పిచ్చుక పునరాగమనం బావుంది. ఈ శీర్షిక కొనసాగించాలి. శ్వేత సౌధాన్ని అలంకరించనున్న ఒబామా ధన్య చరితుడు కావాలి. చూద్దామాలో టిబెట్టు దర్శనం కమనీయం.



థైరాయిడ్ కష్టాలు, తీరనివా డాక్టర్‌గారూ!? బీరకాయ పచ్చడి బహు రుచిగా ఉంది. సినీ రంగంలో శృతీ కమల్ హాసన్ చెప్పిన కబుర్లు బాగున్నాయి. శాంతి దూత గాంధీజీ రూపంలో బెన్ కింగ్స్‌లే ధన్యులు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

నిజంగానే ఒక ఐడియా చాలు

ఈవారం అట్టమీదికథ చదివాం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో బరాక్ ఒబామా భారీ విజయం సాధించాలని కోరుకున్నాం. అలాగే గెలిచారు. భారత పర్యటనకు ఒబామా రావాలనీ, అమెరికా భారత్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలపరచాలని కోరుకుంటున్నాం. చూద్దామా లో ఆలయం దగ్గర బుద్ధభగవానుడి విగ్రహాల గురించి ... అక్కడి ప్రదేశాల గురించి వివరించారు. ఆరోగ్యం ద్వారా, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డా॥ శ్రీకాంత్‌గారు తెలియజేశారు. అప్పట్లో బ్రిటిష్ వారికి గుండెల్లో దడ పుట్టించి పూనకం తెప్పించిన, జాతిపిత మహాత్మా గాంధీ సినిమాల గురించి లాహిరి లాహిరిలో తెల్సుకున్నాం. ఇలాగే గాంధీ గురించి ఎన్నో సినిమాలు చెయ్యాలని, రావాలని కోరుకుంటున్నాము. మూడవ రంగుల పేజీలో 'ఒక ఐడియా చాలు' అంటూ రకరకాల సోఫాలను చూపించారు. వాటిని వాహనాలతో తయారు చెయ్యడం చాలా గ్రేట్. ఈ వారం స్నేహలో ఇంతమంచి విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు.

అనుపోజు సత్యనాగరాజు,
విజయనగరం.



వీరి వీరి గుమ్మడి పండు
వీరి పేరేమి?

ఈ ఫోటో
ఒకప్పటి బాల నటిది.
జవాబు
తెలియాలంటే
25వ పేజీలో
చూడండి.

బాల వికాసం

పిల్లలకూ చెవులుంటాయ్!

ద్వేషం, కుళ్లు, అసూయ, కుత్సితం వంటి దుర్గుణాలను పిల్లల ముందు ప్రదర్శించనే కూడదు. వళ్లు తెలియని ఆవేశాన్ని అమ్మలోనో నాన్నలోనో చూసిన పిల్లలను ఆ అనుభవం జీవితాంతం వెంటాడుతుంటుంది. అమ్మానాన్నలు ఇతరులతో అప్పటికి బాగానే మాట్లాడినా వారినే చాటుగా తిడతారని తెలుసుకున్న పిల్లలు ఆ కపటత్వాన్ని కూడా అలవాటుగా మార్చుకుంటారు. కొన్ని సార్లు అది పైకే మాట్లాడి లేనిపోని చిక్కులు తెచ్చిపెడతారు. ఇక పిల్లల ముందే శృంగారం వొలకబోయడం, బూతులు మాట్లాడ్డం ఎంత తప్పో చెప్పనవసరం లేదు.



పీపీ

గోడలకు చెవులుంటాయనీ, తలుపులకు కళ్లుంటాయని తెలుగులో వాడుకగా చెబుతుంటారు. ఎవరూ లేరనుకుని మాట్లాడితే అవతలి నుంచి వినవచ్చునని, తలుపుల్లోంచి చూడవచ్చునని ఈ మాటల భావన. అయితే లోకజ్ఞతతో ఇంత తెలివిగా పిల్లల గురించి చెప్పక పోవడం ఆశ్చర్యకరమైన విషయం. మనం మాట్లాడే మాటలు మరెవరైనా తెలియకుండా వినవచ్చునని తెలిసిన వారికి ఎదురుగా వున్న పిల్లలు వాటిని వింటారని ఎందుకు తట్టదు? పిల్లలు విన్నవీ కన్నవీ ఇట్టే పట్టేస్తారని అందరికీ తెలుసు. అయినా సరే, బయట వారెవరూ వినకుండా చూసుకోవాలన్న జాగ్రత్త తప్ప పిల్లలపై వాటి ప్రభావం ఏమిటని చాలా మంది పట్టించుకోరు. దీనివల్ల కలిగే దుష్ఫలితాలు లెక్కలేనన్ని.

అసలు పిల్లలు ప్రతిదీ తల్లిదండ్రుల నుంచి ఇతర పెద్దల నుంచీ నేర్చుకుంటారు. వారు ఏది ఎలా చేస్తున్నారో చూసి తెలుసుకుంటారు. స్వంతంగా జ్ఞానం వచ్చేవరకూ పెద్దవాళ్లు చేసిన ప్రతిదీ సరైందనేనని పిల్లలు నమ్ముతుంటారు. వాస్తవంలో తమ అమ్మ కన్నా మంచి వాళ్లు, తన నాన్న కన్నా గొప్ప వాళ్లు లేరని చాలా కాలం వరకూ పిల్లలు భావిస్తుంటారు. ఆపైన బాబాయిలు మామయ్యలు వంటివారిని ఆరాధిస్తారు. తాతయ్యలు నానమ్మల ప్రేమాభిమానాలు ఆస్వాదిస్తారు. దీంతో పాటే ఈ పెద్దల తీరు తెన్నులు వేయి కళ్లతో గమనిస్తూ స్వీకరిస్తూ వుంటారు. ఉమ్మడి కుటుంబాలు లేవు గనక ఇప్పుడు తక్కిన బంధువులు వుండటం తగ్గిపోయింది. తల్లిదండ్రుల ప్రభావం ఇంతకు ముందుకంటే పెరిగింది. పైగా వారి ప్రవర్తనను చిన్న బుర్రలతోనే ఇతర పెద్దలతో పోల్చిచూసుకునే అవకాశం కూడా తగ్గిపోయింది. ఇరుగు పొరుగు సంబంధాలు కూడా ఇదివరకులా వుండటం లేదు. ఆ పైన వీలుంటే టీవీలు మాత్రమే పిల్లల మనోభావాలను తీర్చిదిద్దుతున్నాయి.



పేద మధ్య తరగతి వారికి పెద్ద ఇళ్లుండవు. మరీ పేదలైతే కాళ్లు చాపుకోవడానికి లేని పాకల్లోనే కాపురాలు చేస్తుంటారు. వారి చదువు, స్థాయి కూడా తక్కువగానే వుంటాయి. అవన్నీ పిల్లలపై ప్రభావం చూపుతాయి. నాన్న తాగి వచ్చి గొడవ పడటం, అమ్మను కొట్టడం, పడకగదిలేక వారుపడే పాట్లు ఇవన్నీ పిల్లలు గమనిస్తూనే వుంటారు. ఆ విధంగా వయసును మించిన విషయాలు తెలుసుకుని ముదుర్లుగా ముద్ర వేయించుకుంటారు. ఇలాటి వారినే సినిమాల్లో ముడి కామెడీ కోసం వాడుకుంటారు. అది చూసిన పిల్లలు దాన్ని సమర్థనీయమైన విషయంగానే భావించడం మొదలెడతారు. ఇదంతా ఒక విష వలయం అవుతుంది.

ఇక పిల్లల ఎదుట మాట్లాడేప్పుడు ఎవరైనా నాలుక అదుపులో పెట్టుకోవలసిందే. పెద్దలు ఆయా సందర్భాలలో ఏవేవో మాట్లాడేస్తుంటారు. తర్వాత వాటికే కట్టుబడివుండకపోవచ్చు. లోకజ్ఞానం, లౌక్యం వారికి పుష్కలమే గనక సమయానుకూలంగా మార్చుకోవచ్చు కూడా. కాని పిల్లలకు అంత విచక్షణ వుండదు. ఏ మాట ఏ సందర్భంలో చెప్పారో వారికి తెలియదు. ఫలానా వారు చెడ్డవారు అనో, నమ్మకూడదనో అమ్మ చెప్పడం వింటే అదే నిజమని వారిలో ముద్ర పడిపోతుంది. అలాగే ఎప్పుడైనా కావాలనో అనుకోకుండానో పొరబాటు చేయడం చూస్తే అది సరైందేనని నిర్ధారించుకుంటారు. తామూ అలా చేయొచ్చునని నిర్ణయించుకుంటారు. పిల్లల్లో అపారమైన పరిశీలనా శక్తి వుండటమే దీనికి కారణం. మరీ సందేహం వస్తే తప్ప తమకు కలిగిన అభిప్రాయాల మంచి చెడ్డలను వారు పెద్దలతో మాట్లాడరు. కనకనే పసిమనస్సులపై చెరగని ముద్ర పడిపోతుందని పెద్దలు ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

ద్వేషం, కుళ్లు, అసూయ, కుత్సితం వంటి దుర్గుణాలను పిల్లల ముందు ప్రదర్శించనే కూడదు. వళ్లు తెలియని ఆవేశాన్ని అమ్మలోనో నాన్నలోనో చూసిన పిల్లలను ఆ అనుభవం జీవితాంతం వెంటాడుతుంటుంది. అమ్మానాన్నలు ఇతరులతో అప్పటికి బాగానే మాట్లాడినా చాటుగా వారినే తిడతారని తెలుసుకున్న పిల్లలు ఆ కపటత్వాన్ని కూడా అలవాటుగా మార్చుకుంటారు. కొన్ని సార్లు అది పైకే మాట్లాడి లేనిపోని చిక్కులు తెచ్చిపెడతారు. ఇక పిల్లల ముందే శృంగారం వొలకబోయడం, బూతులు మాట్లాడ్డం ఎంత తప్పో చెప్పనవసరం లేదు.

పిల్లలపై చెడు ప్రభావం చూపే వాటిని నివారించాలంటే ఒకే ఒక మార్గం మంచిని నేర్పించే విషయాలు మాట్లాడ్డమే. మంచి పనులు చేసి చూపించడమే. ✠

తెలుగు భాషా ఘోష
వ్యాస మంజూష

'తుపాకి ఒక్క శరీరాన్ని మాత్రమే వశం చేసుకుంటుంది. భాష మొత్తం ఆత్మనే వశం చేసుకుంటుంది' అంటూ కెన్యా రచయిత నోబుల్ బహుమతి గ్రహీత అయిన గూగీ మాటలను ఉటంకిస్తారు. తెలుగు భాష వ్యాప్తి చెందకపోవడానికి ప్రజలకు వ్యాకరణం రాకపోవడం ఒక కారణమనే వాదన చాందసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. వ్యాకరణం చదువుకోనివారైనా తల్లిభాషలో తప్పుగా మాట్లాడరు. 28 అక్షరాలతో ఆంగ్లభాష ప్రపంచంపై ఆధిపత్యం చలాయిస్తుండగా అంతకు రెట్టింపుగా 56 అక్షరాలు గల తెలుగు పాలనా భాషగా పనికిరాకుండా పోవడం అర్థంలేని విషయమంటారు. చైనీస్ భాషను మూడుసార్లు సంస్కరించుకున్నారని కాని తెలుగు విషయంలో ఇప్పటికీ చిన్న మార్పునైనా స్వీకరించలేకపోవడం మన భాషా వికాసానికి ఆటంకం అయిందన్నారు. ప్రజల భాషను జానపద భాషగా ఎగతాళి చేసిన వారే సహజ భాషను సంస్కృత భూయిష్టం చేశారని ప్రకృతిని వికృతిగా చిత్రించారని ఎత్తిచూపారు. ప్రాచ్య ప్రతుల సేకరణ పరిరక్షణ విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు కూడా ఇదే రీతిలో పరాయీకరించిన భాష ఇంకా ఎంత కాలం? అంటూ ప్రజల తెలుగు సంక్లిష్టమై పోయిన క్రమాన్ని తెలిపారు. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు వెలిచాల కొండలరావు ఇంగ్లీషు నేర్చుకుంటూనే తెలుగు భాషను కాపాడుకోవడం ఎలాగన్న దానిపై సూచనలు చేశారు.ఇంటిభాష అందరి భాష ఎలా అవుతుంది? అన్నవ్యాసంలో భాషా వేత్త ఆచార్య చేకూరి రామారావు ఇంటిభాష కాక ప్రామాణిక భాష ద్వారానే అభివృద్ధి సాధ్యమని సూత్రీకరించారు. మాతృభాషా సంరక్షణ కోసం మహోద్యమం జరగాలంటూ కాకతీయ మాజీ ఉపాధ్యక్షులు పేర్వారం జగన్నాథం నిజాం వ్యతిరేక పోరాటానుభవాలను పొందుపర్చారు.



తెర

తెలుగుకు ప్రాచీన భాష హెూదా వచ్చిందంటూ ఇప్పుడు విజయోత్సవాలు జరుపుతున్నారు. తన పెద్ద కొడుకు ఇంతటి ఘనతకు కారణమని తెలుగుతల్లి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డిని తలుచుకుని మురిసిపోతున్నట్టు ప్రభుత్వం భారీ ప్రచారం చేస్తున్నది. వాస్తవానికి ఈ సమస్య సృష్టించిందే కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ విధంగా వివిధ భాషల మధ్య అకారణ వివాదానికి కారణమైంది (ఇప్పుడు కూడా తెలుగు, కన్నడ భాషలకు గుర్తింపునిచ్చి దక్షిణాదిన ఒక్క మళయాలాన్ని మాత్రం వదలివేయడం మరో సమస్యగా మారింది). ఇప్పుడు ప్రాచీన హెూదా సాధించడమే గొప్ప విషయమైనట్టు రాజకీయ లబ్ధికోసం పాకులాట ఎక్కువగా కనిపిస్తున్నది. ప్రాచీన హెూదా లభించినందుకు పొంగిపోవడం కన్నా ఆధునిక అవసరాలకు తట్టుకునేలా తెలుగును తీర్చిదిద్దుకోవడం ముఖ్యమన్న మాట కూడా వినిపిస్తోంది.

ప్రాచీన హెూదా వల్ల లాభం ఏమిటనే ప్రశ్న అలా వుంచితే తెలుగుకు అంతటి ఘన వారసత్వం వున్నదనే మాట యదార్థం. అలాగే ఆధునికంగా మలుచుకోవలసిన అవసరం వుందనేది కూడా తిరుగులేని నిజం. ఈ రెండు అంశాలనూ సాకల్యంగా స్పృశిస్తూ ఎమెస్కో వారు ప్రచురించిన పుస్తకం తెలు'గోడు'!. 2006 ఆగష్టులో ప్రాచీన భాష చర్చ చాలా ఉధృతంగా సాగుతున్నప్పుడు వర్తమాన తరంగణి శీర్షికన ప్రచురించిన ఈ పుస్తకం తెలుగు భాష గత, ప్రస్తుత పరిస్థితులనూ, భవిష్యత్ సవాళ్లను వివిధ కోణాల నుంచి పరిశీలిస్తుంది.

'ముందుమాట' వంటిది రాసిన పత్రికా సంపాదకులు కె.రామచంద్రమూర్తి తమిళానికి మాత్రమే శ్రేష్టభాష ప్రతిపత్తి కల్పించడం వల్ల ఏర్పడిన వివాదగ్రస్త పరిస్థితిని పరామర్శించారు. అదే సమయంలో ఆంగ్ల భాషా మీడియం పట్ల మధ్య తరగతి, ఉన్నత వర్గాల వారి మోజు కింది తరగతులపైనా ప్రభావం చూపడం సహజమేనని ఆయన అంటారు. అసలు మాతృభాష చదవకుండానే పాఠశాల విద్య పూర్తి చేసే అవకాశం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో తప్ప మరెక్కడా వుండదన్న వాస్తవాన్ని గుర్తుచేశారు. తెలుగు పుస్తకాలూ తెలుగు పత్రికలూ చదవని తరం ఎదగడంతో వారిని ఆకట్టుకోవడానికి మీడియాలో ఆంగ్లపద భూయిష్టమైన ప్రయోగాలు చేయడం జరుగుతోందని విశ్లేషించారు.' ఏ జాతికైనా సంస్కృతి జీవగర్ర. భాష ప్రాణ వాయువు'

.పీల్చేగాలిలో ప్రాణవాయువు పడిపోతే రోగగ్రస్తులమైనట్టే పరభాషా వ్యామోహ పీడితులమై మాతృభాషకు దూరమైన రోగిష్టిమారి జాతిగా మారి కృంగి కృశించి పోతామని హెచ్చరిస్తారు. మాతృభాషలో విద్యాబోధన అన్నది ఐచ్ఛికంగా గాక స్వచ్ఛందంగా జరగాలంటూనే స్థానిక భాషలో పరిపాలన నిర్బంధంగా జరగాలని రెంటికీ మధ్య తేడాను విదితం చేశారు.

ఇక 'అధికార భాష- ఆరాటం' అన్న భాగంలో తెలుగును అధికార భాషగా చేయడంలో వైఫల్యాలు, కారణాల వివేచన చూస్తాం. విద్యావేత్త చుక్కా రామయ్య మాతృభాషకు సాటి లేదు అన్న తన తన వ్యాసంలో పిల్లలు చక్కగా చదువుకోవాలంటే తల్లిభాషలో చదువు చెప్పాలని గట్టిగా ప్రతిపాదిస్తారు. అంతర్గత ఘర్షణకు మాత్రమే కాక సామాజిక పోరాటాలకు కూడా భాష ప్రేరణ అయింది. తెలుగులో చదువుకునే హక్కుకోసం మొదలైన పోరాటమే వీర తెలంగాణా పోరాటంగా రూపు దాల్చింది. ప్రజలు మాట్లాడే భాషను గౌరవించకుండా తాము చెప్పేదే తెలుగన్నట్టు వ్యవహరించడం వల్లనే ఇంటిభాష సముచిత స్థానం కోల్పోయిందని ఆయన అంటారు. ఈ కారణం వల్లనే దళిత ,బలహీన వర్గాల వారి చదువుకోసం ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడుతున్నామనే తప్పుడు వాదనలు బయలుదేరాయన్నారు. ఒకప్పటిలా సమాచారం తక్కువగా వుండటం అది కూడా ఇంగ్లీషులోనే వుండటం అన్నది ప్రస్తుత సమస్య కాదు. కావలసినంత సమాచారం వుంది. దాన్ని అర్థం చేసుకునే స్థాయి పెరగాలంటే మాతృభాషను మించింది లేదు. మూర్ఖంగా ఆంగ్లం కోసం పట్టుబడితే ఆహారం విషతుల్యంగా మారినట్టే అవుతుంది అని ఆయన హెచ్చరిస్తారు. మైసూరు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఆర్వీయస్ సుదర్శనం 'మనం తెలుగువాళ్లమేనా?' అనే ప్రశ్నార్థకంతో రాసిన వ్యాసంలో దాదాపు 15 కోట్ల మంది తెలుగు వాళ్లమున్నా ఆ భాషలో పాఠ్యాంశాలు తయారు చేసుకోలేకపోవడాన్ని ఆక్షేపిస్తారు. ఉర్దూలో చదువుకున్న సి.నారాయణరెడ్డి వంటివారు జ్ఞానపీఠం అధిరోహించగలిగినప్పుడు తెలుగులో చదువుకోవడం తక్కువెలా అవుతుందని సహేతుకంగా వాదించారు.

సీనియర్ పాత్రికేయులు వి.ఆర్.బొమ్మారెడ్డి తన వ్యాసంలో పాలనాభాషగా తెలుగును పెంపొందించడంలో పాలకుల చిత్తశుద్ధి రాహిత్యాన్ని తీవ్రంగా ఖండిస్తారు. ప్రముఖ రచయిత కాలువ మల్లయ్య ఇంగ్లీషుపై ప్రేమతో మాతృభాషను తక్కువ చేసే వారిపై ఆగ్రహం వెలిబుచ్చుతారు.

అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎ.బి.కె. ప్రసాద్ తెలుగు భాషలో రావలసిన సంస్కరణలను గురించి చర్చించారు. 'తుపాకి ఒక్క శరీరాన్ని మాత్రమే వశం చేసుకుంటుంది. భాష మొత్తం ఆత్మనే వశం చేసుకుంటుంది' అంటూ కెన్యా రచయిత నోబుల్ బహుమతి గ్రహీత అయిన గూగీ మాటలను ఉటంకిస్తారు. తెలుగు భాష వ్యాప్తి చెందకపోవడానికి ప్రజలకు వ్యాకరణం రాకపోవడం ఒక కారణమనే వాదన చాందసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. వ్యాకరణం చదువుకోనివారైనా తల్లిభాషలో తప్పుగా మాట్లాడరు. 28 అక్షరాలతో ఆంగ్లభాష ప్రపంచంపై ఆధిపత్యం చలాయిస్తుండగా అంతకు రెట్టింపుగా 56 అక్షరాలు గల తెలుగు పాలనా భాషగా పనికిరాకుండా పోవడం అర్థంలేని విషయమంటారు. చైనీస్ భాషను మూడుసార్లు సంస్కరించుకున్నారని కాని తెలుగు విషయంలో ఇప్పటికీ చిన్న మార్పునైనా స్వీకరించలేకపోవడం మన భాషా వికాసానికి ఆటంకం అయిందన్నారు. ప్రజల భాషను జానపద భాషగా ఎగతాళి చేసిన వారే సహజ భాషను సంస్కృత భూయిష్టం చేశారని ప్రకృతిని వికృతిగా చిత్రించారని ఎత్తిచూపారు. ప్రాచ్య ప్రతుల సేకరణ పరిరక్షణ విభాగం సంచాలకులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమల రావు కూడా ఇదే రీతిలో పరాయీకరించిన భాష ఇంకా ఎంత కాలం? అంటూ ప్రజల తెలుగు సంక్లిష్టమై పోయిన క్రమాన్ని తెలిపారు. తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు వెలిచాల కొండలరావు ఇంగ్లీషు నేర్చుకుంటూనే తెలుగు భాషను కాపాడుకోవడం ఎలాగన్న దానిపై సూచనలు చేశారు.ఇంటిభాష అందరి భాష ఎలా అవుతుంది? అన్నవ్యాసంలో భాషా వేత్త ఆచార్య చేకూరి రామారావు ఇంటిభాష కాక ప్రామాణిక భాష ద్వారానే అభివృద్ధి సాధ్యమని సూత్రీకరించారు. మాతృభాషా సంరక్షణ కోసం మహోద్యమం జరగాలంటూ కాకతీయ మాజీ ఉపాధ్యక్షులు పేర్వారం జగన్నాథం నిజాం వ్యతిరేక పోరాటానుభవాలను పొందుపర్చారు.

పత్రికా భాష వివాదం పేరిట వార్తల్లో సాగిన చర్చా వేదికను రెండవ భాగంగా ప్రచురించారు. ప్రసార సాధనాలలో ఇంగ్లీషును అనవసరంగా ఉపయోగిస్తున్నారన్న విమర్శలపై సి.రాఘవాచారి, బొమ్మారెడ్డి, వాసుదేవ దీక్షితులు, వరదాచారి, ఎబికె ప్రసాద్, పొత్తూరి వెంకటేశ్వరరావు వెల్లడించిన అభిప్రాయాలు ఇందులో చూస్తాం.

ఇక మూడవ భాగం శ్రేష్ఠభాష వివాదానికి సంబంధించినవి. ఇప్పుడు ఆ గుర్తింపు సాధించుకోవడం పూర్తయిన నేపథ్యంలో వాటిని ఒకసారి వెనక్కు తిరిగి చూసుకోవడం చాలా ఆసక్తికరంగా వుంటుంది. విశేషమేమంటే ఈ భాగంలో భాషా సమస్యను విభిన్న కోణాల నుంచి చూపించే వ్యాసాలు ఒకే చోట లభిస్తాయి. 'వెనకచూపు' 'ముందు చూపు' మధ్య తేడా తెలుస్తుంది. లంకా శివరామ ప్రసాద్, ముదిగొండ శివప్రసాద్, ఎంవిఆర్ శాస్త్రి (కొంతవరకు రామనరసింహం) వంటి వారు కేవలం గత కావ్యాలలోని ఆధారాలపై వ్యాఖ్యానాలతో తెలుగు గొప్పతనాన్ని కీర్తించడానికే పరిమితమైనారు. వాటిలో కొంత దురభిమానం ఛాయలు కూడా గోచరిస్తాయి. ఇదే భాగం ద్వితీయార్థంలో జ్వాలాముఖి, ఇన్నయ్య, రంగనాయకమ్మ, ఇనగంటి వెంకట్రావు,తెలకపల్లి రవి వంటివారు ప్రాచీన హోదా సాధించుకోవడంతోపాటు ఆధునికత్వం వైపుగా అభివృద్ధిచెందాల్సిన అవసరాన్ని ఎక్కువగా చెబుతారు. 'ఆదికవి' స్మరణలో 'సోది'కవులను విస్మరించడం వల్లనే తెలుగు భాష ప్రాచీనత మరుగుపడిపోయే స్థితి వచ్చిందని తెలకపల్లి రవి తన వ్యాసంలో వ్యాఖ్యానిస్తారు. ప్రాచీనత కన్నా నిబద్ధత నేటి అవసరమంటారు జ్వాలాముఖి. ప్రాచీన హోదా కోసం పాకులాటకన్నా నిత్యజీవితంలో మాతృభాషను కాపాడుకోవడానికి చేయగలిగింది చేయడం ముఖ్యమని రంగనాయకమ్మ చెబుతారు. ఇక ఈ చర్చకు నాంది పలికిన వి.లక్ష్మణరెడ్డి, చాలా కాలం కిందటే దీనిపై లేఖ రాసిన తుర్లపాటి కుటుంబరావు, దీనిపై పోరాటానికి సన్నాహంగా సమావేశం నిర్వహించిన సి.నారాయణరెడ్డి, ఆవుల మంజులత, ద్వానాశాస్త్రి వంటివారి వ్యాసాలు కూడా చాలా విషయసంపన్నంగా, ఆసక్తికరంగా నడుస్తాయి. అన్ని ఒకే అంశంపై రాసినవైనా వేర్వేరు కోణాలను ఆవిష్కరించేవిగా వుండటం ప్రత్యేకత. ఈ సందర్భంలో చదవదగిన పుస్తకం ఇది.



కథ

సోదరులు

రచయిత : బ్యోర్న్ స్టెర్న్ బ్యోర్న్ సన్
అనుసృజన : ముక్తవరం పార్థసారథి

స్కూల్ టీచర్ బార్డ్. అతని తమ్ముడు ఆండర్స్. ఒకరంటే ఒకరికి ప్రాణం. పుట్టినప్పటినుండీ అన్ని పనులూ కలిసే చేశారు. ఒక్కరోజుకూడా దూరంగా ఉండలేదు. ఇద్దరూ ఒకేరోజు సైన్యంలో చేరారు. ఒకే కంపెనీలో ఉద్యోగం చేశారు. ఇద్దరికీ ఒకే రోజు కార్పొరల్‌గా ప్రమోషన్ వచ్చింది. ఒకేరోజు రిటైరయ్యారు. ఇంత వరకు వాళ్లనెవరూ విడివిడిగా చూడలేదు. కొంతకాలానికి వాళ్ల తండ్రి కాలం చేశాడు. ఆస్తి బాగానే సంక్రమించింది సోదరులకు. కానీ అది పంచుకుని విడిపోవడం వాళకిష్టంలేదు. అందువల్ల ఉన్నదంతా వేలం వేసి ఎవరిక్కావలసింది వాళ్ళు కొనుక్కోవడం మేలనుకున్నారు. అలాగే చేశారు. అయితే, తండ్రికో ఖరీదైన గోల్డ్ వాచ్ ఉంది. ఆరోజుల్లో అలాంటి వాచ్ ఆ ప్రాంతంలో మరెవరి దగ్గరా లేదు. అది వేలానికి వచ్చినప్పుడు చాలామంది ధనికులు పాట పాడటానికి ముందుకు వచ్చారు. అయితే సోదరులిద్దరూ పోటీ పడి పాట పెంచటంతో మిగతావాళ్లు వెనక్కు తగ్గారు. తమ్ముడు తనకు వదిలేస్తాడని అన్నా, అన్న తనకు వదిలేస్తాడని తమ్ముడూ ఆశించారు. కానీ అది జరగకపోగా పాటతో ఎవరూ ఆగలేదు. ధర అనూహ్యంగా పెరిగింది. ఒకరివైపొకరు చిరాకుగా, కోపంగా చూసుకున్నారు. చివరికి ఇరవై డాలర్లకు చేరుకుంది పాట. తమ్ముడిలా పట్టు పడతాడనుకోలేదు బార్డ్. ఇంక వెనక్కు తగ్గటమెందుకనుకుంటూ ముప్పై డాలర్లకు పెంచాడు. అయినా ఆండర్స్ ఆగలేదు. "తను చూపిన ప్రేమ, ఆప్యాయత, అనురాగమంతా మరిచిపోయాడా తమ్ముడు!" అనుకున్నాడు బార్డ్. పైగా తను పెద్దవాడు. పాట నలభైకి చేరుకుంది. ఇప్పుడొకరినొకరు చూసుకోటానిక్కూడా ఇష్టపడలేదిద్దరూ. ఆక్షన్ హాల్‌లో టెన్షన్ పెరిగింది. 'అన్న ఎందుకిలా పట్టుపడుతున్నాడు. అడిగితే తను నామమాత్రపు ధరకే వదులుకునేవాడే. అతని కోరికను తిరస్కరించటం, ఆజ్ఞను ధిక్కరించటం ఇంతవరకూ జరగలేదే! అనుకున్నాడు ఆండర్స్. కానీ ఎవరి ఆలోచనలు వారివి. బార్డ్ కోపంగా "యాభై" అన్నాడు. అవును మరి పెంచక తప్పదు. ఓడిపోతే అందరి ముందరా తనకెంత అవమానం! ధర ఇంకా పెరిగింది. బార్డ్‌కు వశం తప్పింది.

"వంద డాలర్లు. మన సంబంధానిక్కూడా ఇదే చివరిరోజు" అన్నాడు ఉద్రేకంతో ఊగిపోతూ. హాలు నిండా నిశ్శబ్దం. ఇక అక్కడ నిల్చోలేక గుర్రమెక్కి ఇంటికి ప్రయాణమయ్యాడు. వెనక నుంచి ఆక్షన్ డీలర్ వచ్చి "ఆండర్స్ పాట నీకే వదిలేశాడు. వాచీ నువ్వు కొనుక్కో"మన్నాడు. అప్పుడు కానీ అతడిలో పశ్చాత్తాపం ప్రారంభం కాలేదు. తమ్ముడి మీద ప్రేమ పొంగి పొర్లింది. తనెంత మూర్ఖంగా ప్రవర్తించాడు. ఒక వాచీ కోసం తన ప్రాణంలో ప్రాణమైన తమ్ముణ్ణి వదులుకోవటమా? హాలు నుండి జనమంతా వెలుపలికొచ్చారు. ఆ గుంపులో ఆండర్స్ కూడా ఉన్నాడు. అన్న మనస్సులో ఘర్షణ అతడికి తెలియదు.

"నీ ప్రేమకు చాలా థాంక్స్ అన్నయ్యా. నువ్వన్నట్టు మన సంబంధానికిదే చివరి రోజు. ఇక నీ ఇంటి గడప తొక్కితే ఒట్టు" అన్నాడు నిష్ఠూరంగా.

"ఈఊరికాఊరు అంతే దూరం. గుడ్‌బై" అన్నాడు బార్డ్ రుద్ధకంఠంతో, ఉబికివస్తున్న కన్నీళ్లను ఆపుకోడానికి విఫలయత్నం చేస్తూ. ఆనాటి నుండి పుట్టిపెరిగిన ఇంటికి ఇద్దరూ దూరమయ్యారు. కొన్నాళ్లకు ఆండర్స్ పెళ్లి చేసుకున్నాడు. కానీ అన్నను రమ్మని కూడా పిలవలేదు. ఎంత తమ్ముడైనా ఆహ్వానించకపోతే బార్డ్ మాత్రం ఎందుకు పోతాడు. ఆండర్స్ పెంచుకున్నా ఆవు చచ్చిపోయింది. కారణం ఎవరూ చెప్పలేకపోయారు. రోజులు బాగా లేనట్టుంది. ఒకటి తర్వాత ఒకటి కష్టాలు కట్టకట్టుకుని వచ్చాయి. అతడి పరిస్థితి దిగజారిపోయింది. ఒకనాడు ఇల్లు కూడా కాలి బూడిదైంది.

"ఎవరో నామీద చేతబడి చేసుంటారు. నేను చావాలని కోరుకుంటున్నారు" అంటూ భోరున ఏడ్చాడు ఆండర్స్. ఉన్నదంతా పోయింది. బికారిగా మారాడు. పని చేసి సంపాదించాలనే కోరిక కూడా లేదు. అగ్ని ప్రమాదం జరిగిన మరుసటి రోజు బార్డ్ తమ్ముణ్ణి పరామర్శించటానికి వచ్చాడు. అప్పటి దాకా మంచం మీద ముడుచుకుని పడుకున్న ఆండర్స్ దిగ్గున లేచి కూర్చున్నాడు.

"ఎందుకొచ్చినట్టు? ఇక్కడ నీకేం పని!" అంటూ కటువుగా ప్రశ్నించాడు.

"నీకు సహాయం చేయటానికి వచ్చాను ఆండర్స్" అన్నాడు బార్డ్ అనునయంగా.

"నా కష్టాలతో నీకేం పని? ఇంకా ఎందుకు చావలేదా అని చూడ్డానికొచ్చావా? నా తిప్పలు నేను పడతానులే. వెళ్లు వెళ్లు"

"నువ్వు అపార్థం చేసుకున్నావు"

"వెళ్లు ముందర! అంటూ వురిమాడు ఆండర్స్. బార్డ్ ఒకడుగు వెనక్కు వేశాడు.

"వాచ్ కావాలంటే నువ్వే తీసుకో" అన్నాడు బార్డ్ తమ్ముణ్ణి సముదాయించటానికి.

"వెళ్తావా వెళ్లవా?" అంటూ ముందుకడుగు వేశాడు ఆండర్స్ ఆగ్రహంగా.

బాధను అణచుకుంటూ బార్డ్ వెనుదిరిగాడు.

తమ్ముణ్ణెలాగైనా ఆదుకోవాలని మనసు పీకుతోంది. జరిగిందేదో జరిగింది. క్షణిక కోపంలో చేసిన పొరపాటుకు ఎన్నాళ్లు కుమిలిపోవటం! వాడన్ని కష్టాల్లో కూరుకుపోయి వుంటే తనకు మనశ్శాంతి ఎలా వుంటుంది! కానీ తనకై తాను మళ్లీ వెళ్లాలంటే అభిమానం అడ్డు వచ్చింది. పైగా పెద్దవాణ్ణనైనా చూడకుండా తనను అవమానించి పంపాడు. తను స్నేహ హస్తం చాచినా జనం తననే చులకనగా చూస్తారు. ఆదివారం నాడు చర్చికి వెళ్లినప్పుడు అక్కడ ఆండర్స్ కనిపించాడు. మరింత చిక్కిపోయాడు. ఎముకలు తేలాయి. మొహం పీక్కుపోయింది. ఒంటిమీద చిరిగిన దుస్తులు మాటువేసి తొడుక్కున్నాడు. బార్డ్ ఉనికినైనా గమనించలేదు. శిలువ మీది ప్రభువువైపే భక్తి పారవశ్యంతో చూస్తూ మోకరిల్లాడు. బార్డ్‌కు బాల్యం జ్ఞాపకం వచ్చింది. ఆండర్స్ ఎంత చురుకైన కుర్రాడు. తమ్ముణ్ణి వదిలి ఉండలేడిక. పాత రోజులు మళ్లీ రావాలని దేవుణ్ణి మనసారా ప్రార్థించాడు. ఆకోరిక రావడమేమిటి, తక్షణమే వెళ్లి ఆండర్స్ పక్కన కూర్చోవాలనుకున్నాడు. కానీ ఎవరో అడ్డొచ్చారు. పైగా వాడు తనవైపు చూడ్డానిక్కూడా ఇష్టపడటంలేదు. పక్కన వాడి భార్యకూడా వుంది. ఇక్కడెందుకు, ఇంటికెళ్లడమే శ్రేయస్కరం అనుకున్నాడు. సాయంత్రమైంది. తమ్ముడి ఇంటిముందు నిలిచాడు. తలుపు తట్టడానికి భయంగా ఉంది. లోపల భార్యాభర్తలు మాట్లాడుకుంటున్నారు.

"చర్చిలో మీ అన్నగారు కనిపించారు. నీ గురించే ఆలోచిస్తున్నాడేమో!"

"లేదులే. అతడిది మరొకరి గురించి ఆలోచించే స్వభావం కాదు. ఎంతసేపూ తన గొడవే"

తమ్ముడి మాటలకు బార్డ్‌కు చెమట పట్టింది. చలిగా ఉంది. అయినా చాలా సేపు అవక్కడే నిలుచున్నాడు. లోపల కెటిల్‌లో నీళ్లు మరుగుతున్నట్టుంది. ఆవిరి చప్పుడు వినిపిస్తుంది. చిన్నపిల్ల ఏడ్చింది.

"ఒప్పుకోవుగానీ నువ్వు కూడా అస్తమానూ మీ అన్నగారి గురించే ఆలోచిస్తుంటావులే. నాకు తెలియదా మీ స్వభావాలు" అవంది భార్య.

"ఇంకేదన్నా మాట్లాడు" అంటూ విసుక్కున్నాడు ఆండర్స్.

బార్డ్ ఇంక తిరిగి పోదామనుకున్నాడు. కానీ అంతలోనే తలుపు తెరుచుకుంది. చలి మంటకు కట్టెల కోసం ఆండర్స్ కొట్టం వైపుకు వచ్చాడు. ఇంట్లో వేసుకునే పైజమా, షర్టుకు బదులు సైనిక యూనిఫాం వేసుకున్నాడు. "ఇది ఇక తొడుక్కోవద్దు. పిల్లలకు జ్ఞాపకంగా దాచిపెట్టాలని" సైన్యం నుండి బయటకు వచ్చిన రోజున వాగ్దానం చేసుకున్నారు. పైగా ఆండర్స్ దానిని రోజూ వాడటం వల్ల చిరిగినట్టుంది. అదే సమయంలో బార్డ్ జేబులోని గోల్డ్ వాచ్ టిక్‌టిక్‌మంటూ శబ్దం చేసింది. ఆండర్స్ కట్టెలు తీసుకుని వెళ్లటానికి బదులు ఆకాశం వైపు దీనంగా చూస్తూ "ఇంకెన్నాళ్లు ప్రభూ ఈ కష్టాలు!" అంటూ చేతులెత్తి ప్రార్థించాడు. ఆ మాటల్ని చివరి రోజుదాకా మర్చి పోలేదు బార్డ్. ఆక్షణానే వెళ్లి తమ్ముణ్ణి గుండెలకు హత్తుకోవాలనుకున్నాడు. కానీ ధైర్యం చాలలేదు. జబ్బు మనిషిలాగా దగ్గుతూ ఆండర్స్ కట్టెలు తీసుకుని వెళ్లాడు. మరో పది నిమిషాలదాకా అక్కణ్ణుంచి కదల్లేదు బార్డ్. బహుశా రాత్రంతా అక్కడే ఉండేవాడేమో. కానీ చలి తీవ్రమైంది. అలా ఆరుబైట నిల్చుంటే మంచులో కూరుకుపోయేవాడే. తమ్ముణ్ణి ఆపరిస్థితిలో చూడటం కలచి వేస్తోంది. చివరికి కట్టెల కొట్టంలో లాంతరు వెలిగించి కొక్కానికి తన గోల్డ్‌వాచ్ తగిలించి, తన బాధ్యత నిర్వర్తించాన్న తృప్తితో చిన్నపిల్లాడిలా ఇంటికి పరిగెత్తాడు. ఆరాత్రి కొట్టానికి నిప్పంటుకుంది, లాంతరు నుండి నిప్పు రవ్వలు లేచి వుంటాయి, పైనున్న గడ్డికప్పు కూడా కాలింది. బార్డ్ కుమిలి కుమిలి ఏడ్చాడు. ఈ ఘోర పాపానికి నిష్కృతి లేదు అనుకుంటూ రోజంతా మోకరిల్లి, ప్రార్థనా గ్రంథాలు చదువుతూ దైవస్మరణలో గడిపాడు. తెలియక చేసినా నేరం నేరమే. ఆ రాత్రి మసక వెన్నెల వెలుగులో తమ్ముడింటి పాక దగ్గరకెళ్లి వాచ్ కోసం వెదికాడు. గోళీ కాయంత బంగారు ముద్ద దొరికింది. కరిగి మిగిలిందదే. అది పట్టుకుని వెళ్లి తమ్ముడికి జరిగిందంతా చెప్పి గుండె బరువు దించుకుందామనుకున్నాడు. కానీ మొహమాటం, బెరుకు, భయం. బార్డ్ బూడిదలో వెతుకుతున్నప్పుడు ఓ చిన్న పిల్ల చూసింది. క్రితం రోజుకూడా అతడక్కడికి రావటం చూశారు అక్కడే ఆడుకుంటున్న మరికొంతమంది పిల్లలు. అన్న తమ్ముళ్లిద్దరూ బద్ధశత్రువులని ఊరంతా తెలుసు. ఇరుగుపొరుగు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభమైంది. ఎవరూ ఏమీ నిరూపించలేదు. కానీ అందరి అనుమానం బార్డ్ మీదే. ఏ ముఖం పెట్టుకుని పలకరించగలడిప్పుడు?

అన్న దొంగ చాటుగా తనింటికి వచ్చాడని ఆండర్స్‌కి తెలిసింది. కానీ అతనడు నోరు మెదపలేదు. ఇంటిని తగలపెట్టినందుకు పశ్చాత్తాపంతో ఏడ్చాడని కూడా చెప్పారు జనం. కానీ ఇంత నీచమైన పని దేవుడు కూడా క్షమించడు. నేరం రుజువు కాలేదు కానీ ఇంత దారుణానికి ఒడికట్టింది బార్డేనని ఊరంతా అనుకుంది. దర్యాప్తు సందర్భంగా అన్నదమ్ములిద్దరూ ఎదురుపడ్డారు. ఖరీదైన కొత్త దుస్తుల్లో బార్డ్, చింకి పోయిన పాత దుస్తుల్లో ఆండర్స్. అన్న మొహంలోని దైన్యం ఆండర్స్ గమనించకపోలేదు. "బహుశా తనకు వ్యతిరేకంగా చెప్పవద్దని వేడుకుంటున్నట్టుంది" అనుకున్నాడు. అందువల్ల దర్యాప్తు అధికారి "మీ అన్నమీద నీకు అనుమానముందా?" అని అడిగినప్పుడు లేదన్నాడు ఆండర్స్.



మిగిలిన ఒకే ఒక్క పాక కూడా అగ్నికి ఆహుతి కావటంతో ఆండర్స్‌కు నిలువ నీడ లేకుండా పోయింది. అన్నీ ఉన్నా బార్డ్ పరిస్థితి అంతకన్నా అధ్వాన్నంగా ఉంది. పశ్చాత్తాపాగ్ని అతణ్ణి ప్రతి క్షణం దహించివేస్తోంది. నిద్రాహారాలు మాని నిరంతర దు:ఖంలో మునిగిపోయాడు.

ఇప్పుడతణ్ణెవరూ గుర్తుపట్టలేరు. ఒక సాయంత్రం పేదరాలెవరో వచ్చి వెంట రమ్మంది. కాసేపటికి కానీ పోల్చుకోలేకపోయాడు. ఆవిడ ఆండర్స్ భార్య. సిగ్గుతో అవమానంతో మరింత కుంగి పోయాడు. ఆమె ఎందుకు పిలిచిందో కూడా గ్రహించగలడు. ఆండర్స్ పూరిపాకలో దీపం వెలుగు కనిపించింది. అంతా ముళ్ల బాట. ఆవెలుగే లేకపోతే అక్కడ నడవటం అసాధ్యం. చాలా సార్లు మంచులో దిగబడి పోయాయి కాళ్లు. పాక తలుపు వద్ద ఏదో వాసనేసింది. కడుపులో తిప్పినట్టైంది. లోపల పసి పిల్లాడు బొగ్గు తింటున్నాడు. మొహం కూడా నల్లబారింది. పళ్లు మాత్రం తెల్లగా మెరిశాయి. వాడు ఆండర్స్ కొడుకు. కుక్కి మంచం మీద ముడుచుకుని పడుకున్నాడు ఆండర్స్. చిరుగు పాత బొంతలు కప్పుకున్నాడు. కళ్లు పీక్కుపోయాయి. అస్థి పంజరాన్ని చూసినట్టుగా ఉంది. తమ్ముడి మంచం మీద పడి వెక్కివెక్కి ఏడ్చాడు బార్డ్. కాసేపటికి బైటికి పొమ్మని భార్యకు సైగ చేశాడు ఆండర్స్. బార్డ్ ఆమెను ఉండమని అర్థించాడు. అన్నదమ్ములు జరిగిన విషయాలన్నీ వివరంగా మాట్లాడుకున్నారు. వేలంపాట నుండి ఆనాటి దాకా. బార్డ్ జేబులోంచి బంగారు ముద్ద బైటికి తీసి చూపించాడు. తాము విడిపోయిన నాటినుండి ఏ ఒక్కరూ ఒక్క రోజుకూడా సుఖంగా గడపలేదు. ఆండర్స్ బాగా బలహీనంగా ఉన్నాడు. తమ్ముడి ఆరోగ్యం కుదుట పడిందాకా మంచం పక్కనుండి కదల్లేదు బార్డ్.

"ఇప్పుడు నాకు మనశ్శాంతిగా ఉంది. ఇంక మనమెప్పుడూ విడిపోకూడదు అన్నయ్యా!" అంటూ కౌగిలించుకున్నాడు ఆండర్స్. కానీ ఆరోజే అతడు మరణించాడు. అతడి భార్యనూ, కొడుకునూ వెంట తీసుకెళ్లాడు బార్డ్. వాళ్ల సంరక్షణ, పోషణ బాధ్యత తనే తీసుకున్నాడు. ఆనాడు అన్న దమ్ములు మాట్లాడుకున్న విషయాలు క్రమంగా ఊరంతా తెలిశాయి. నిప్పుల్లో కాలిన బంగారం లాంటిదే బార్డ్ మనసు. అన్నదమ్ముల బంధమంటే అలాగే ఉండాలనుకున్నారందరూ. అందరి గౌరవాన్ని, ప్రేమాభిమాల్ని అందుకున్న బార్డ్ స్కూల్ టీచర్‌గా మారి పిల్లలకు పాఠాలు చెపుతూ చిరకాలం జీవించాడు. అతడు నిజంగా అందరికీ బోధించింది సాటి మనుషుల పట్ల ప్రేమ చూపటం గురించి... సర్వ మానవ సౌభ్రాతృత్వమే నిజమైన నాగరికత అని... పిల్లలకు అతడు టీచర్ కాదు, తమలో ఒకడు. వృద్ధబాలుడు.

రచయిత గురించి

"యస్, వి లవ్ దిస్ ల్యాండ్" అంటూ ప్రారంభమౌతుంది నార్వేజియన్ జాతీయగీతం. అది రాసింది బ్యోర్న్ స్టెర్న్‌సన్. జననం బెర్గాన్ నగరంలో. తండ్రి పాస్టర్. ఆస్లో(రాజధాని) లోని క్రిస్టియానా స్కూల్లో చదువుతున్నప్పుడు హైన్రిశ్ ఇబ్సెన్ ఇతని సహాధ్యాయి. 1854లోనే సాహితీ విమర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు బ్యోర్న్ సన్. 1857లో రాసిన నాటకం "యుద్ధాల మధ్య కాలంలో" ప్రేక్షకులలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. బెర్గెన్ నాటకశాలలో ఇబ్సెన్ వారసుడిగా నాటకాలకు దర్శకత్వం వహించాడు. రాజకీయాల్లో ప్రవేశించి, సాంప్రదాయవాదులకు వ్యతిరేకంగా ఉద్యమించి లిబరల్ పార్టీ విజయానికి సహాయం చేశాడు. అయితే, ప్రవృత్తి రీత్యా బ్యోర్న్ సన్ రచయిత. నార్వేలో ఉంటే రాజకీయాల నుండి విరామం లేదు కనుక విదేశాలకెళ్లి రచనలు కొనసాగించాడు. ఇతని ముఖ్య నాటకాలు 'ఆర్న్', 'ఎ హ్యాపీ బోయ్'. గ్రామీణ జీవితాన్నీ, రైతుల పరిస్థితులనూ లోతుగా అధ్యయనం చేసి అనేక కథలూ, నవలలూ రాశాడు. 'సోదరులు' ఇతి వృత్తం అదే. నార్వే ప్రాచీన చరిత్రనూ, వీరగాథలనూ గ్రంథస్థం చేశాడు. 1860-63 కాలంలో ఇటలీలో నివసించి మైకెలేంజిలో, గ్రీకు శిల్పకళ మీద పరిశోధన చేశాడు. 1873 తర్వాత సమకాలీన సమస్యలమీద దృష్టి కేంద్రీకరించి, మత సహనాన్ని ప్రచారం చేస్తూ నాటకాలు రాసి ప్రదర్శించాడు. తనను తాను 'సోషలిస్టు'గా ప్రకటించుకున్నాడు. ఆరోజుల్లో అదొక సంచలన నిర్ణయం. బోర్న్ సన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇబ్సెన్, అలెగ్జాండర్ కీలెండ్, జొనాస్ లై లతో కలిసి, పందొమ్మిదవ శతాబ్దిలో నార్వే సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పునరుజ్జీవనానికి కృషి చేసిన నలుగురు ప్రముఖుల్లో ఒకడిగా ప్రశంసలందుకున్నాడు. అయితే తర్వాతి కాలంలో ఇబ్సెన్‌తో పోల్చినప్పుడు ఇతడి కీర్తి ప్రతిష్ఠలు కాస్త తగ్గాయి. 1903లో బ్యోర్న్ సన్‌కు నోబెల్ బహుమతి లభించింది.

ఆరోగ్యం

హార్మోను సమస్యలు
తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డాక్టర్ కె. శ్రీకాంత్,
ఎండోక్రినాలజిస్ట్,
శ్రీకాంత్ ఎండోక్రినాలజి క్లినిక్,
గుంటూరు.

శరీరంలో వివిధ రకాల హార్మోన్లు నిరంతరం పనిచేస్తూ జీవక్రియలను సక్రమంగా నిర్వహిస్తాయని చెప్పుకున్నాం కదా. శరీరంలో హార్మోన్ల ఉత్పత్తిలో గానీ, పనిచేసే విధానంలో గానీ హెచ్చుతగ్గుల వల్ల వివిధ రకాల హార్మోను సమస్యలు వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి ఎత్తుపెరుగుదల లోపాలు, నెలసరి ఇబ్బందులు, స్త్రీలలో అవాంఛిత రోమాలు, సంతానం కలుగకపోవటం, ఎముకల బలహీనత (ఆస్టియోపోరోసిస్) మొదలైనవి. హార్మోను సమస్యలు, వాటి నుండి వచ్చే వ్యాధుల గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం....



ఎత్తు పెరుగుదల లోపాలు

ఎత్తు పెరుగుదల వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పౌష్టికాహారం, వివిధ హార్మోన్ల సమన్వయం, వంశ పారంపర్యత ఎత్తు పెరుగుదలను ప్రభావితం చేస్తాయి. పిల్లలందరూ వయసుకు తగిన ఎత్తు ఎదుగుతున్నారో లేదో తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా ఎండోక్రినాలజిస్ట్ ఆధ్వర్యంలో గ్రోత్ చార్టు తీసుకోవాలి. దీనినే గ్రోత్ మానిటరింగ్ అంటారు. ఇది అందరు పిల్లలకూ అవసరం. ఎందుకంటే గ్రోత్ మానిటరింగ్ ద్వారా ఎత్తు పెరుగుదల లోపాన్ని గుర్తించి కారణాన్ని కనుగొని దానిని సరిచేయడం ద్వారా శాశ్వతంగా పొట్టిగా ఉండటాన్ని అరికట్టే అవకాశం ఉంది. పౌష్టికాహార లోపాన్ని గుర్తించేందుకు క్యాల్షియం, పాస్ఫరస్, హీమోగ్రామ్ వంటి పరీక్షలు జరపవలసి వస్తుంది. పౌష్టికాహార లోపం ఉన్నా, థైరాయిడ్ హార్మోను, గ్రోత్‌హార్మోను, సెక్స్ హార్మోన్లలో ఏఒక్క హార్మోను లోపం ఉన్నా ఎత్తు పెరుగుదలలో లోపాలు వస్తాయి. పిల్లలు వయసుకు తగిన ఎత్తుకు ఎదగకుంటే వారిని వెంటనే ఎండోక్రినాలజిస్ట్‌చే పరీక్ష చేయించి సరైన మందులు లేదా హార్మోన్లు తీసుకోవటం ద్వారా తగినంత ఎత్తు ఎదిగే అవకాశం ఉంటుంది. చాలా మంది పిల్లలు 16, 17 సంవత్సరాల వయస్సు వచ్చాక అంటే అమ్మాయిల్లో రుతుస్రావం మొదలైనా, లేదా అబ్బాయిలలో మీసాలు, గడ్డాలు రావటం మొదలైనా ఆతర్వాత ఎలాంటి ట్రీట్‌మెంట్ ఇచ్చినా ఎంత ఖర్చుపెట్టినా ఎత్తు పెరుగుదల అవకాశాలు తక్కువ. ఈవిషయాన్ని గమనించి అందరు పిల్లలకు ఎండోక్రినాలజిస్ట్ పర్యవేక్షణలో గ్రోత్ మానిటరింగ్ ద్వారా ఎత్తు పెరుగుదలను ముందుగానే గుర్తించి తగిన వైద్యం ద్వారా ఎదుగుదల లోపాలను అరికట్టవచ్చు.

యుక్తవయస్కులలో శారీరక వికాసలోపాలు

యుక్తవయస్కులలో సెకండరీ సెక్సువల్ క్యారెక్టర్స్... అంటే అమ్మాయిలలో ఛాతి పెరుగుదల, నెలసరి మొదలవడం, అబ్బాయిలలో మీసాలు-గడ్డాలు మొదలవడం, పురుషాంగం మరియు వృషణాలు పరిమాణంలో పెద్దవి అవడం అనేవి హార్మోన్ల సమన్వయం మీద ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా థైరాయిడ్ హార్మోన్లు, సెక్స్‌హార్మోన్లలో (ఈస్ట్రోజిన్, టెస్టోస్టిరిన్, ఎఫ్ఎస్‌హెచ్, ప్రొలాక్టిన్ మరియు జిఎన్ఆర్‌హెచ్) ఏ ఒక్క హార్మోను సమతుల్యత దెబ్బతిన్నా యుక్తవయసులో సహజంగా రావాల్సిన శారీరక వికాస మార్పులు రావటంలో ఆలస్యమవుతుంది. కొందరిలో అరుదుగా ఈ మార్పులు ముందుగానే రావడం కూడా జరుగుతుంది. వీరిలో ఎత్తు పెరుగుదల లోపాలు కూడా సంభవించవచ్చు. కొందరు అబ్బాయిలలో అమ్మాయిలకు ఉండే లక్షణాలు, అమ్మాయిలలో అబ్బాయిలకు ఉండే లక్షణాలు ఉండవచ్చు. వీరు సరైన సమయంలో ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించి అవసరమైన హార్మోను పరీక్షలు, ఇతర పరీక్షలు చేయించుకోవాలి. కొందరిలో జన్యుసమస్యల వల్ల కూడా ఇవి సంభవించవచ్చు. వీరిలో క్యారియోటైపింగ్ వంటి జన్యుసంబంధిత పరీక్షలు అవసరమవవచ్చు. తగిన సమయంలో ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించడం, సలహా మేరకు పరీక్షలు, చికిత్సను అనుసరించడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు.

హిర్సుటిజమ్స్
(అవాంఛిత రోమాలు)

5నుండి 10 శాతం ఆడవారిలో ఈ సమస్య ఉంటుంది. నల్లని, దళసరి మందపాటి వెంట్రుకలు పైపెదవిపైన, గవదమీద, ఛాతిపైన, వీపుపై, పొత్తికడుపుపైన, తొడలముందు ప్రాంతంలో అతిగా పెరగడాన్ని హిర్సుటిజమ్ అంటారు. ఎండోక్రిన్ సమస్యలు హిర్సుటిజమ్‌కు ముఖ్యమైన కారణాలు. మగవారిలో ముఖ్యమైన సెక్స్ హార్మోన్లయిన ఆండ్రోజెన్స్ ఆడవారిలో కూడా కొద్దిమోతాదులో సహజంగానే ఉత్పత్తి అవుతాయి. ఇవి మోతాదుకు మించి ఉండటం వల్ల హిర్సుటిజమ్

వస్తుంది. అవాంఛిత రోమాలు రాకుండా ఉండటానికి కారణాన్ని గుర్తించడం చాలా అవసరం. ముఖ్యంగా టెస్టోస్టిరాన్, డిహెచ్ఇఎస్, ప్రొలాక్టిన్, థైరాయిడ్ పరీక్షలు వీరికి అవసరమవుతాయి. ముఖ్యంగా పాలిసిస్టిక్ ఒవేన్ (పిసిఓ), ప్రొలాక్టిన్ ఎక్కువవడం, హైపోథైరాయిడిజమ్, హిర్సుటిజమ్‌కు దారితీయవచ్చు. సరైన సమయంలో ఎండోక్రినాలజిస్టును సంప్రదించడం, తగిన పరీక్షలు, వైద్యం ద్వారా పూర్తిగా ఉపశమనం పొందవచ్చు.

పిసిఓ

నెలసరి ఇబ్బందులు, రుతుక్రమం లేటుగా రావటం, హిర్సుటిజం (అవాంఛిత రోమాలు) ఉన్న వారిలో చాలా మందికి పిసిఓ (పాలిసిస్టిక్ ఓవరీస్) సమస్య ఉంటుంది. వీరిలో అధిక బరువు,ఇన్సులిన్ రెసిస్టెన్స్, సంతానలోపం కూడా తరచుగా సంభవిస్తాయి. వీరికి ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ప్రొలాక్టిన్, జిటిటి (గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్) మొదలైన పరీక్షలు అవసరమవుతాయి. అధిక బరువు తగ్గటం, వైద్యసలహా మేరకు పరీక్షలు, వైద్యం ద్వారా దీనిని అధిగమించవచ్చు.

నెలసరి ఇబ్బందులు

ఆడవారిలో జిఎన్ఆర్‌హెచ్

ఎఫ్ఎస్‌హెచ్, ఎల్‌హెచ్, ఈస్ట్రోజన్స్ మొదలైన హార్మోన్ల సమన్వయం ద్వారా యుక్తవయస్సు రాగానే రజస్వల అవడం, ఆ తర్వాత క్రమం తప్పకుండా రుతుక్రమం మొదలవుతాయి. ఇంతేకాకుండా థైరాయిడ్ హార్మోన్లు, ప్రొలాక్టిన్ వంటివి కూడా సరైన స్థాయిలో ఉండాలి. వాటన్నింటిలో ఏఒక్క హార్మోను హెచ్చుతగ్గులు ఉన్నా నెలసరి ఇబ్బందులు ఎదురవుతాయి. అంటే సహజంగా 28-32 రోజులకొకసారి రావాల్సిన రుతుక్రమం తరచుగా అంటే 15-20 రోజులకే రావడం కానీ (పాలీ మెనోపాజ్), లేదా తక్కువ తరచుగా అంటే 40 లేదా అంతకన్నా ఎక్కువరోజులకొకసారి నెలసరి రావడం (ఒలిగోమెనోపాజ్), నెలసరి అసలు రాకపోవడం జరగవచ్చు. కొన్నిసార్లు ఈ ఇబ్బందులు సంతానలేమికి కారణమవవచ్చు. కాబట్టి ఇటువంటి నెలసరి ఇబ్బందులలో వైద్య సలహా, ఎండోక్రిన్ పరీక్షలు, తగిన వైద్యం ద్వారా సమస్యలను దూరం చేసుకోవచ్చు.

సంతానలోపం

దంపతులలో సంతానలోపం అనే సమస్య ఇద్దరిలోగానీ, లేదా ఎవరో ఒకరిలోగానీ ఉండవచ్చు. సంతానసామర్థ్యం ముఖ్యంగా సరైన శారీరక నిర్మాణం, సరైనరీతిలో వివిధ హార్మోన్ల విడుదలవడం మీద ఆధారపడి ఉంటుంది. శరీర నిర్మాణ లోపాలను, హార్మోన్ల హెచ్చుతగ్గులను గుర్తించడానికి దంపతులు ఇద్దరిలోనూ వివిధ పరీక్షలు అవసరమవుతాయి. ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించాల్సిన అవసరం ఉంటుంది. చాలా మందిలో ఈసమస్యకు సరైన కారణం గుర్తించి తగిన వైద్యం ద్వారా అధిగమించవచ్చు.

మెనోపాజ్ సమస్యలు

స్త్రీలలో సహజంగా 36 నుండి 42 ఏళ్ళ మధ్య రుతుస్రావం తక్కువగా... తరచుగా రావడం మొదలై పూర్తిగా ఆగిపోవడం జరుగుతుంది. దీనిని మెనోపాజ్ అంటారు. కొందరిలో ఇది రావాల్సిన దానికంటే చాలా ఏళ్ళ ముందు రావడం (35 ఏళ్ళకంటే ముందు) జరుగుతుంది. వీరిలో చెమటలు పట్టడం, శరీరం నుండి ఆవిర్లు వచ్చినట్లు అనిపించడం, విసుగు, దడ, నిద్రలేమి, డిప్రెషన్ మొదలగు లక్షణాలు తరచుగా వచ్చినా తీవ్రంగా ఉన్నా ఎండోక్రినాలజిస్ట్ అవసరం రావచ్చు. అంతేగాక ఎముకలలో కాల్షియం తగ్గిపోవడం అందువల్ల ఫ్రాక్చర్లకు గురయ్యే ప్రమాదం కూడా పెరుగుతుంది. వీటి గురించి అవగాహన, పరీక్షలు, వైద్యం చాలా ముఖ్యం.

ఎముకల బలహీనత

ఇది చాలా మందిలో ఉండే ముఖ్యమైన సమస్య. ముఖ్యంగా పౌష్టికాహార లోపం (కాల్షియం,విటమిన్ డి లోపాలు) ఈస్ట్రోజన్ లోపం, శారీరకశ్రమ లేకపోవడం కొన్ని మందులు తరచుగా ఎక్కువ మోతాదులలో వాడటం ప్రధానమైన కారణాలు. అంతేకాకుండా మహిళల్లో గర్భిణీ దశలో పెరిగిన క్యాల్షియం అవసరాలు, మెనోపాజ్ మార్పులు ఎముకలను బలహీనపరుస్తాయి. హైపర్ పారా థైరాయిడిజమ్, కుష్షింగ్ సిండ్రోమ్, మూత్రపిండాలు ఫెయిల్ అవడం, సెక్స్ హార్మోన్ల లోపం కూడా దీనికి దారితీయవచ్చు. ఆస్టియోపోరోసిస్ వల్ల వయస్సు మీదపడిన వారిలో తరచుగా ఫ్రాక్చర్లు, మరియు పేషెంట్ కేవలం మంచానికే పరిమితమవడం చివరికి తక్కువ వయసులోనే మరణానికి కూడా దారితీయవచ్చు. సమాజంలో ఆస్టియోపోరోసిస్ తీవ్రత ఎక్కువగా ఉన్నా కూడా దీనిని ఖచ్చితంగా కొలవగల పరికరాలు ఎక్కడో ఒకచోట ఉండటం వల్ల దీనిని తక్కువసార్లు కనుక్కొంటున్నారు. ఆస్టియోపోరోసిస్ వ్యాధి నిర్ధారణకు డెక్సా స్కాన్ అత్యంత ఖచ్చితంగా (బోన్‌మినరల్ డెన్సిటీ కొలవడానికి) ఉపయోగపడుతుంది. అత్యాధునిక పరికరాలు కలిగి ఉన్నా ఆస్టియోపోరోసిస్ ఎండోక్రిన్ సమస్య కాబట్టి దీని గురించిన అవగాహన, పరీక్షలు మరియు వైద్యానికి ఎండోక్రినాలజిస్ట్‌ను సంప్రదించటం మంచిది. సరైన సమయంలో సరైన కారణాన్ని కనుగొని చికిత్సతోనే చికిత్స ద్వారా ఆస్టియోపోరోసిస్‌ను తద్వారా వచ్చే ఫ్రాక్చర్లు, డిఫార్మిటి రాకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలి.

అడ్రినల్ సమస్యలు

మన శరీరంలో రెండు కిడ్నీలకు ఎగువున అడ్రినల్ గ్రంథులు ఉంటాయి. ఇవి ముఖ్యంగా గ్లూకోకార్టికాయిడ్స్ (కార్టిసోల్), మినరల్ కార్టికాయిడ్స్ (ఆల్డోస్టిరోన్) అనే హార్మోన్ల ను ఉత్పత్తి చేస్తాయి. ఈ హార్మోన్లు ముఖ్యంగా శరీరంలో నీరు మరియు లవణాల పరిమాణాన్ని నియంత్రిస్తాయి. కొన్ని రకాల ఊబకాయానికి పిట్యూటరి లేదా అడ్రినల్ సమస్యల వల్ల కార్టిసోల్ ఎక్కువగా ఉండటం కారణమవవచ్చు. చిన్న వయసులోనే హైపర్‌టెన్షన్ వచ్చినవారిలో అడ్రినల్ సమస్యలు కారణం కావచ్చు. ఊబకాయ సమస్యలకు చిన్నవయసులోనే హైపర్‌టెన్షన్ వంటి సమస్యలు ఉన్న వారు ఎండోక్రినాలజిస్ట్ సలహాను అనుసరించి తగిన పరీక్షలు వైద్యం చేయించుకోవాలి.

ఓరల్ గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్ (ఓజిటిటి)

ఈ పరీక్షలో పరగడుపున రక్తంలో గ్లూకోజ్ స్థాయిని పరీక్షిస్తారు. తర్వాత 75గ్రాముల గ్లూకోజ్‌ను తాగించి రెండు గంటల పాటు ప్రతి గంటకు రక్తంలో గ్లూకోజ్ స్థాయిని పరీక్షిస్తారు. ఈపరీక్ష ద్వారా షుగర్ వ్యాధి రాగల అవకాశాలను ముందుగానే గుర్తించవచ్చు. తద్వారా దయాబెటిస్ రాకముందే (ప్రీడయాబెటిస్) సరైన జాగ్రత్తల ద్వారా (ఆహారపు అలవాట్లలో మార్పులు, వ్యాయామం) వ్యాధి ముందే రాకుండా కొన్ని సంవత్సరాల వరకు నివారించవచ్చు. షుగర్ వ్యాధి వంశపారపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉండటం వలన తల్లిదండ్రులలో షుగర్‌వ్యాధి ఉన్నవారికి ఈ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాగే ఊబకాయం ఉన్నవారు, పిసిఓ ఉన్నవారు సంతానలేమితో బాధపడేవారు, షుగర్ వ్యాధి లక్షణాలు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలలో వ్యాధి రాగల ప్రమాదం ఉన్నవారు కూడా ఈపరీక్ష ద్వారా ఇన్సులిన్ రెసిస్టెన్స్, షుగర్ వ్యాధి రాగల ప్రమాదాన్ని నిర్ధారించుకోవచ్చు.



అతి పొడవాటి వ్యక్తి
అతి పొట్టి వ్యక్తి

ప్రశ్నించడం ప్రారంభిద్దాం

స్ఫూర్తి

మతం అధికారమైన చోట
ఎదుటి వారి విశ్వాసాలకు జవాబులుండవ్
అంతా ఆ దేవుడి లీల
కాదంటే కత్తుల హేల
అధికార మార్పిడికై
మతం మారణాయుధమైన చోట
గుజరాత్‌లో మోడీ విసిరిన కత్తులకు
చిందిన రక్తం మరకలు
మానవత్వాన్ని వెక్కిరిస్తాయి
లుంబినీ పార్క్, గోకుల్ చాట్
మక్కా మసీదు బాంబు పేలుళ్లలో
కాళ్ళు చేతులూ తెగిపడ్డ
అమాయకుల రోదనలు
చంపబడ్డ పిల్లవాళ్ళ
చివరి చూపు ఆశలు
దానవత్వానికి సాక్ష్యం చెబుతాయి
హేతుబద్ధ
సమాధానం ఇవ్వనప్పుడు
అన్ని మతాలు అబద్ధాలే!
సర్వమత సమానత్వమన్నది
భ్రాంతి అయిన చోట
మత యుద్ధాల క్రూసేడ్లు ఉంటాయి
భాగల్పూర్ ఉంటుంది

సతిపేర్చి కన్యారమ్మను కాల్చిన
మతం
భూమి గుండ్రమన్న ఊహలకే
ఉరేసిన మతం
బురఖా లేనందుకు
ఆడవారి మోకాళ్లపై యాసిడ్ చల్లే
మతం
పరాయి వాడిని పెళ్ళాడితే
పార్టీ నుండి గెంటేసే మతం
ఏ మతమైనా ఒక్కటే
అవి ఎక్కించేది మత్తుమందే
అధికారానికి అవెప్పుడూ విందే
హేతువాదం జీవితమైన చోట
ప్రశ్నించడం పవిత్రమైన చోట
మనుషుల మధ్య మతాల
అడ్డుగోడలుండవు
మనిషిని మనిషిగా గౌరవించే
చక్కని సంబంధాలు తప్ప!
అందుకే ప్రశ్నించడం
ప్రారంభిద్దాం!
మతం పునాదులను మొదలంటా
పెరికేద్దాం!

పెరడు దాటని పికాసో

గేరా

అమ్మ, చిత్రకారిణి కాదంటే
ఎవరు నమ్మినా నమ్మకపోయినా
పేడతట్ట నమ్మదు,
చీపురు కట్ట నమ్మదు
ముగ్గుబుట్ట నమ్మదు,
ముందు వాకిలీ నమ్మదు
అన్నిటికంటే ముందు
సూర్యుడి కంటితో చూసే
ఆకాశం అసలు నమ్మదు
లెక్క తప్పని చుక్కలు,
పక్కకు పోని రేఖలు

ఎన్ని ఒంపులో-
అన్ని వయ్యారాలు
ఎన్ని సొంపులో-
అన్ని సోయగాలు
తెల్లారేసరికల్లా
కల్లాపి నేలపై వెల్లివిరిసే
కోకొల్లల రంగవల్లికలు
అవును గదా,
అమ్మ-
గుర్తింపు కోరుకోని ఓ అద్భుత
కళాకారిణి
నెత్తుటి రంగులతో
నిన్నూ నన్నూ చిత్రించిన చిత్రకారిణి!!

చికెన్ కట్‌లెట్స్

కావలసినవి

ఉడికించిన మెత్తని చికెన్ ముక్కలు - 1కప్పు
వరిపిండి లేదా కార్న్‌ఫ్లోర్ - 3 టేబుల్ స్పూన్లు
కొత్తిమీర తరిగినది - 1 టేబుల్ స్పూన్
ఉప్పు - తగినంత, పాలు - 11/2 కప్పులు
తెల్ల మిరియాల పొడి - పావు టేబుల్ స్పూన్
జాజికాయ పొడి - పావు టేబుల్ స్పూన్
కోడిగుడ్లు (తెల్లసొన) - 2, నూనె - వేయించటానికి సరిపడా

బాండీలో కొద్దిగా నూనె వేసి వేడిచేయాలి. అందులో కొద్దిగా వరిపిండి లేదా కార్న్‌ఫ్లోర్‌ను వేసి ఉండలు కట్టకుండా పాలు పోస్తూ కలపాలి. సన్న మంట మీద చిక్కబడేవరకూ ఉడికించాలి. ఈ మిశ్రమం క్కబడుతుండగా అందులో మెత్తని చికెన్ ముక్కలను వేయాలి. తరిగిన కొత్తిమీర, ఉప్పు, మిరియాలపొడి, జాజికాయ పొడి వేసి బాగా కలపాలి. ఒక పొంగు వచ్చేవరకు ఉడికించి స్టౌమీద నుండి దించాలి. అది చల్లారాక చిన్న చిన్న ముక్కలను కట్‌లెట్స్ ఆకారంలో వత్తుకోవాలి. ఇలా చేసుకున్న కట్‌లెట్స్‌ను వరిపిండిలో అద్ది ముందుగానే గిలకొట్టుకుని ఉంచుకున్న కోడిగుడ్డు తెల్లసొనలో ముంచి తీసి పక్కన పెట్టుకోవాలి. అవి బాగా ఆరిన తర్వాత నూనెలో దోరగా వేయించుకోవాలి. వీటిని టొమాటో చిల్లీ సాస్‌తో గానీ, చట్నీతో గానీ తింటే బాగుంటాయి.

నువ్వుల పచ్చడి

కావలసిన పదార్థాలు

నువ్వులు : 25 గ్రాములు, వేరుశనగగుళ్లు : 20 గ్రాములు
కొబ్బరి : 20 గ్రాములు, పచ్చిమిర్చి : 25 గ్రాములు
అల్లం వెల్లులి పేస్ట్ : ఒక స్పూన్, చింతపండు : 20 గ్రాములు
టొమాటోలు : 100 గ్రాములు, కొత్తిమీర : ఒక కట్ట
పుదినా : ఒక కట్ట, పసుపు : 1/2 స్పూన్
ఉప్పు : తగినంత, నూనె : తగినంత

తాలింపు పదార్థాలు

ఒక స్పూన్ జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, ఎండుమిర్చి, కరివేపాకు.

ముందుగా నువ్వులు, జీలకర్ర, కొబ్బరి, వెల్లుల్లి రెబ్బలు నూనెలో వేయించి పక్కన పెట్టాలి. పచ్చిమిర్చి, టొమాటో ముక్కలు, కొత్తిమీర, పుదీనా నూనెలో వేయించాలి. తరువాత రెండూ కలిపి పసుపు, చింతపండు తగినంత ఉప్పు వేసి మిక్సీ (రోట్లో వేసి పేస్ట్ చేస్తే మరీ రుచిగా ఉంటుంది)లో వేసి పేస్ట్ చేసుకోవాలి. తరువాత తాలింపు పెట్టుకోవాలి. నువ్వుల చట్నీ రెడీ. అన్నంలోగాని, చపాతీలోగాని తింటే ఎంతో రుచిగా ఉంటుంది.



బంగాళదుంప పెరుగుకూర

కావలసినవి

బంగాళ దుంపలు - పావుకిలో, పెరుగు - 1కప్పు
ఉల్లిపాయలు - 2, పసుపు - చిటికెడు
టొమాటోలు - 2, వెల్లుల్లి - 1 పాయ
ఆవాలు - 1టీ స్పూన్, జీలకర్ర - కొంచెం
ఉప్పు - తగినంత, నూనె - 1 టేబుల్ స్పూను
పచ్చిమిర్చి - 10, కరివేపాకు - 2రెబ్బలు

బంగాళ దుంపలు పొట్టు తీసి ముక్కలుగా కోసుకుని వుంచుకోవాలి. మూకుడులో నెయ్యిపోసి బాగా మరిగించాలి. అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి, ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి.

అందులో బంగాళ దుంప ముక్కలు కూడావేసి కాసేపు వేయించాలి. అప్పుడే టొమాటో ముక్కలు, ఉప్పు, పసుపు కలపాలి. అందులోనే పెరుగుకూడా వేయాలి. ముక్కలు ఉడకటానికి సరిపడా నీళ్లుపోసి ఉడకనివ్వాలి. మొత్తం ఉడికిన తర్వాత కరివేపాకు వేసి దింపెయ్యొచ్చు. ఇష్టపడితే నిమ్మకాయ కూడా పిండుకోవచ్చు.

టొమాటో హల్వా

కావలసినవి

టొమాటోలు - పావుకిలో
జీడిపప్పు - 4
యాలుకలు - 3
కొబ్బరికాయ -1
పంచదార - 200గ్రాములు

టొమాటోలను కుక్కరులో పెట్టి 1గ్లాసు నీళ్లుపోసి 5నిమిషాలు ఉడికించాలి. ఉడికిన తర్వాత టొమాటోలను తీసుకుని వేడి చల్లారాక మెత్తగా పిసికి వడ కట్టాలి. కొబ్బరితీసి మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. రుబ్బిన కొబ్బరి, టొమాటో రసం, పంచదార ఒక గిన్నెలో వేసి పొయ్యిమీద పెట్టి అడుగంటకుండా తిప్పుతూ ఉండాలి. చిక్కబడిన తర్వాత దించి నెయ్యిరాసి ఉన్న పళ్లెంలోకి వంచుకోవాలి. దానిపై వేయించిన జీడిపప్పు, యాలుకపొడి చల్లుకోవాలి. ఆరిన తర్వాత మనకు కావలసిన సైజులో ముక్కలుగా కోసుకోవచ్చు.

తెలుసుకుందామా...

ఇఎంఎస్ అకాడమీ విశిష్టత

ఇఎంఎస్ అకాడమీ ముఖద్వారం

ఆదిమూలం శేఖర్

కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురానికి 25 కిలోమీటర్ల దూరంలో, పచ్చని చీర కప్పుకున్న పశ్చిమ కనుమల్లో చుట్టూ రబ్బరు, అరటి, కొబ్బరి, పోక చెట్లు. ఆ నడుమ, ఎత్తయిన గుట్టపై ఆహ్లాదకర వాతావరణంలో కేరళ సంప్రదాయ భవన నిర్మాణ రీతుల్లో వెలసిన కొన్ని భవంతులు. ఆ భవన సముదాయంలో ఒక వైపు విద్యార్థులకు, పరిశోధకులకు చక్కని విజ్ఞాన భాండాగారం, మరో వైపు ప్రజా ఉద్యమ కార్యకర్తల నిరంతర శిక్షణాకేంద్రం. ఇంకోవైపు చక్కని వసతులతో కూడిన అతిథి గృహాలు. ఎటు చూసినా ప్రకృతి రమణీయ దృశ్యాలు. అదే ఇఎంఎస్ అకాడమీ. ఇఎంఎస్ అని ఆప్యాయంగా పిలుచుకునే ఇఎంఎస్ నంబూద్రిపాద్ అంటే తెలియనివారు వుండరు. భారత దేశంలో మొట్ట మొదటి కమ్యూనిస్టు ప్రభుత్వానికి (కేరళ), ఇంకా చెప్పాలంటే ప్రపంచంలోనే తొలిసారిగా ఎన్నికల ద్వారా అధికారాన్ని చేజిక్కించుకున్న కమ్యూనిస్టు ప్రభుత్వానికి ఆయన సారథి. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ప్రేరణతో కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రవేశించిన ఇఎంఎస్ కేరళ ముఖ్యమంత్రిగా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వహించారు. ఆయన పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ సామాజిక శాస్త్రాల అధ్యయన, పరిశోధనా కేంద్రం తిరువనంతపురంలో ప్రముఖ దర్శనీయ స్థలాల్లో ఒకటి.

డీమ్డ్ యూనివర్శిటీ స్థాయిలో...

హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం తరహాలో మరో విజ్ఞాన భాండాగారంగా తిరువనంతపురం (పాత పేరు త్రివేండ్రం)లో ఇఎంఎస్ అకాడమీ అవతరిస్తోంది. ఈ అకాడమీ నిర్మాణం కోసం ప్రత్యేకంగా ఒక ట్రస్టు ఏర్పాటయింది. దీని వైశాల్యం 36.5 ఎకరాలు. లక్ష పుస్తకాలతో గ్రంథాలయం, సామాజిక శాస్త్రాల అధ్యయన, పరిశోధనా కేంద్రంగా దీనిని రూపుదిద్దనున్నారు. ఇప్పటికే భవంతుల నిర్మాణం పూర్తయింది. గ్రంథాలయానికి ప్రత్యేక భవనం, సెమినార్లు వంటివి నిర్వహించుకోడానికి మరో ప్రత్యేక భవనం, బస చేయడానికి హాస్టల్ భవనాలు, క్యాంటీను నిర్మించారు. మూడు అంతస్తులతో వున్న హాస్టల్ భవనం 300 మంది బస చేయడానికి అవసరమైన గదులు, బెడ్లు, ఇతర సదుపాయాలు వున్నాయి. మహిళల కోసం ప్రత్యేక హాస్టల్ నిర్మించారు. పది గదులతో ఫ్యాకల్టీ హౌస్ వుంది. 16 గదులతో అకడమిక్ బ్లాక్ వుంది. ఒకేసారి వెయ్యిమంది భోజనాలు చేయడానికి వీలుగా క్యాంటీను నిర్మించారు. 1999 మార్చి 19వ తేదీ ఇఎంఎస్ మొదటి వర్ధంతి రోజున అకాడమీకి కమ్యూనిస్టు కురువృద్ధుడు, ఇటీవల కన్నుమూసిన హరికిషన్ సింగ్ సూర్జిత్ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతానికి భవనాల నిర్మాణం పూర్తయింది. ఇప్పుడిప్పుడే గ్రంథాలయం రూపుదిద్దుకుంటోంది. 'లక్ష పుస్తకాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నాం. దీన్ని ఎలక్ట్రానిక్, డిజిటల్ లైబ్రరీగా రూపొందించాలనుకుంటున్నాం. అకాడమీని డీమ్డ్ యూనివర్శిటీ స్థాయిలో అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం.' అని వివరించారు ప్రస్తుతం అకాడమీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఎ.ప్రతాప చంద్రన్ నాయర్. ప్రస్తుతానికి అకాడమీలో అన్ని స్థాయిల్లో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఒకేరోజు నాలుగు కోట్ల నిధుల సేకరణ

అకాడమీ కోసం ఒకేరోజు నాలుగు కోట్ల రూపాయల నిధులు సేకరించారు కేరళ సిపిఎం కార్యకర్తలు. డబ్బాలు తీసుకుని వీధుల వెంట తిరగడం ద్వారా నిధులను సమీకరించారు. ఈ నిధులతోనే అకాడమీ రూపుదాల్చింది. అకాడమీ చుట్టూ వున్న 36.5 ఎకరాల విస్తీర్ణంలో రబ్బరు చెట్లు పెంచారు. ప్రస్తుతం వాటి నుంచి రబ్బరు జిగురు ఉత్పత్తి అవుతోంది. ఇంకా ఇతర పంటలు కూడా వేశారు. ఈ ఆదాయం అకాడమీ ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి ఉపయోగకరంగా వుంది.

✠


లైబ్రరీ భవనం

హాస్టల్ భవనం

బాలనేస్తాలు

తేడాలు కనుక్కోవాలోచ్



జవాబు: కుక్కబెల్టు, మెయిల్ బాక్స్, రిమోట్, చెట్టు మీద యాపిల్ పళ్లు.

దారి ఏదబ్బా...



తప్పేంటో కనిపెట్టండి

హాయ్ బుజ్జాయిలూ... కోడిపుంజు బొమ్మ బావుందా! దాన్ని ఓ అంకుల్ వేసి పంపాడు. అచ్చంగా మీకోసమే. కాకపోతే ఆయనేమంటాడంటే...ఈ బొమ్మలో ఏదో తప్ప వుందంట. దాన్ని మీరు కనిపెట్టాలి. మరి బా...గా... పరిశీలించి జవాబు చెప్పండే.



ఆన్సర్: కోడిపుంజు కాళ్లు చూశారా! ఎలా వున్నాయి? బాతు కాళ్లలా కదూ. కోడిపుంజుకైతే వేళ్ల మధ్య ఇలా చర్మం వుండదు. అదే ఈ బొమ్మలో వున్న తప్పు.

చుక్కలు కలిపేస్తే పోలా



ఇక నిశ్చింత... నిర్భయం...

రాజీవ్ ఆరోగ్యశ్రీతో అభయం

దేహం ఒకటి ఉందని సందేహం రానీయకపోవడమే ఆరోగ్యం అన్నాడు చలం, తన మ్యూజింగ్స్‌లో. దేహంపై సందేహం పెను సంక్షోభానికి సంకేతం. ఆరోగ్యవంతుడైన మనిషే ఆనందమయ సమాజానికి అద్దం. అలాంటి ఆనందమయ సమాజాన్ని తీర్చిదిద్దే బృహత్ యజ్ఞంలో భాగమే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం.

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం రాష్ట్రమంతటా ఏడున్నర కోట్ల మందికి వర్తింపు

సర్వేజనా సుఖినోభవంతు అన్నది ఎంతో ఉదాత్తమైన భావన, ఆలోచన, అభిలాష. సర్వజనులూ సుఖంగా ఉండటమే సత్పరిపాలకుల కోరిక, ఆశ, ఆశయం. వైద్యో నారాయణ హరి అన్నారు. స్వయంగా వైద్య నారాయణుడే పరిపాలకుడిగా ఉన్నప్పుడు ప్రజారోగ్యానికి అదే తిరుగులేని భరోసా. అనతికాలంలోనే 76 ప్రాజెక్టులు చేపట్టి అపరభగీరథుడిగా అవతారమెత్తడమే కాకుండా రాజీవ్ ఆరోగ్యశ్రీతో ధన్వంతరిగా దర్శనమిస్తున్నాడు. నిరుపేదలకు సైతం ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించడానికి ఉద్దేశించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకమే అందుకు ప్రబల తార్కాణం.

పేదవాడి జబ్బు కుటుంబాన్నే కుంగదీస్తుంది. సొమ్ముల్లేక, వైద్య చికిత్స కరవైతే చివరకు సమాజంలోని బహు సంఖ్యాక వర్గం రోగగ్రస్థమై ప్రగతి పడకేస్తుంది. పేదవారెవరికీ అలాంటి దుస్థితి రాకుండా చూడాలన్న ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి సదాలోచన రాజీవ్ ఆరోగ్యశ్రీ రూపంలో ఇప్పుడు సఫలమైంది. రాష్ట్రంలోని 90 శాతం ప్రజానీకానికి ఈ పథకం ఆరోగ్య ప్రదాయినిగా మారింది. వ్యాధి బాధలు లేని సుఖ సంతోషమయ సమాజాన్ని ఆవిష్కరించే దిశలో ఇదో గొప్ప ముందడుగు.

తెల్ల రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాల వారికి రెండు లక్షల రూపాయల బీమా

వ్యాధి రహిత సమాజం

ప్రజా జీవితంలోకి అడుగు పెట్టక ముందు ఒక డాక్టరుగా రూపాయికే వైద్య సేవలు అందించిన డాక్టర్ రాజశేఖర రెడ్డి రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఖర్చుకు వెనుకాడకుండా ఒక శాశ్వత కార్యక్రమాన్ని రూపొందించాలన్న అంతర్మథనానికి వాస్తవ రూపం రాజీవ్ ఆరోగ్యశ్రీ.

ముఖ్యమంత్రి సహాయనిధి(సి.ఎం.ఆర్.ఎఫ్.) ద్వారా వైద్య సహాయం కోసం దరఖాస్తు

863 గుర్తించబడిన చికిత్సలు/ శస్త్ర చికిత్సలు పైసా ఖర్చు లేకుండా లభ్యం

చేసుకున్న ప్రతి వారికి ఉదారంగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి, విస్తృత ప్రయోజనాల రీత్యా సి.ఎం.ఆర్.ఎఫ్.ను కూడా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో విలీనం చేశారు. 2004కి ముందు తొమ్మిదేళ్లలో సి.ఎం.ఆర్.ఎఫ్. నుంచి రూ.5 కోట్ల మేర సాయం అందగా, గత

నాలుగేళ్లలో డాక్టర్ రాజశేఖర రెడ్డి ఎంతో ఉదారంగా వ్యవహరించి రూ.424 కోట్లు అందించారు. తద్వారా 1.23 లక్షల మందికి ఆరోగ్య సేవలు లభించాయి.

45 వేల మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు

ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా అందరికీ ఒకే రకమైన వైద్య సేవలను అందించడమే రాజశేఖరుని ఆశయం. సమ సమాజ స్థాపనకు ఆయన చేస్తున్న కృషికి ఇదొక నిదర్శనం. ఆధునిక వైద్య సౌకర్యాలను పేదలకు ఉచితంగా అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2007 మార్చి 31న మూడు జిల్లాలలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ పథకాన్ని మలి దశలో మరో పది జిల్లాలకు, తాజాగా మిగిలిన పది జిల్లాలకు విస్తరించారు. దేశ వైద్య చరిత్రలోనే విప్లవం సృష్టిస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్రమంతటా ఏడున్నర కోట్ల మందికి వర్తించే విధంగా యుపిఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియా గాంధీ ప్రారంభించారు.

తెల్ల రేషన్ కార్డు (తెలుపు, అన్నపూర్ణ, అంత్యోదయ) కలిగి ఉన్న కుటుంబాల వారందరూ అర్హులుగా ఉండే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఇప్పటివరకు 13 జిల్లాలలో మొత్తం ఏడు లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వారిలో వైద్యులు గుర్తించిన దాదాపు 45 వేల మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు జరిపారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.200 కోట్లు ఖర్చు చేసింది. ఈ పథకంలో భాగంగా ఒక్కొక్కరికి ఆరు లక్షల రూపాయలు ఖర్చయ్యే క్లోకర్ ఇంప్లాంట్ చికిత్సను 190 మందికి కల్పించారు.

తెల్ల రేషన్ కార్డు ఆధారంగా పేద కుటుంబాల వారికి ఇచ్చే హెల్త్ కార్డు శ్రీరామరక్షగా, రెండు లక్షల రూపాయల వరకు వైద్య సదుపాయాలను బీద రోగులు ఉచితంగా పొందవచ్చు. రోగులకు తగిన సహకారం అందించేందుకు ఆరోగ్య మిత్ర వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఎంతో పారదర్శకంగా అమలవుతున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పట్ల పలు రాష్ట్రాలు ఆసక్తి చూపడం విశేషం.

ఆరోగ్యశ్రీ బడ్జెట్ రెట్టింపు

దశల వారీగా రాష్ట్రమంతటా అమలులోకి తెచ్చిన రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేద రోగికి ఖర్చు లేని వైద్యం అందించేందుకు వీలుగా బడ్జెట్ నిధులను రూ.450 కోట్ల నుంచి రూ.950 కోట్లకు పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఆరంభంలో చేపట్టిన 330 రుగ్మతలకు అదనంగా మరో 533 వెరసి 863 రుగ్మతలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లో భాగమైన 320 ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నారు. శస్త్ర చికిత్స తరవాత కూడా ఏడాది పాటు మందులు, ఇతర సేవలు అందిస్తారు.

ఆరోగ్యశ్రీ కోసం ఇప్పటి వరకు రూ.200 కోట్లు ఖర్చు

మరోవైపు ఇప్పటికే ప్రజాదరణ పొందిన 104, 108 సేవలను మరింత విస్తృత పరిచి, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సంచార వైద్యశాలల సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న 502 అంబులెన్స్‌ల సంఖ్యను 652కు పెంచుతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 108 అంబులెన్స్‌ల సేవల కోసం రోజుకు 60 వేల కాల్స్ వస్తుండగా, ఇప్పటివరకు సకాలంలో రోగులను ఆసుపత్రులకు తరలించడం ద్వారా 30 వేల మంది ప్రాణాలు కాపాడారు. ఇలా సకాలంలో వైద్యం లభించి ప్రాణాపాయం నుంచి బయటపడిన వారిలో 80 శాతం మందికి పైగా బడుగు, బలహీనవర్గాల వారే ఉండటం విశేషం.

పల్లెల్లో సరైన వసతులు లేక, వైద్యానికి నోచుకోని వారికి 104 వాహనాల ద్వారా ఉచిత వైద్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. తొలిదశలో 100 వాహనాలతో వైద్యసేవలను విస్తరిస్తోంది. అక్టోబర్ నాటికి 475 వాహనాలతో రాష్ట్రవ్యాప్తంగా

రాష్ట్రంలో108 అంబులెన్స్ సేవల ద్వారా 30వేల మంది ప్రాణాలు కాపాడారు.

320 ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్యం

విస్తరించడం జరుగుతుంది. ఈ 104 వాహనాలలో శిక్షణ పొందిన వైద్య సహాయక సిబ్బంది శిశువులకు టీకాలు మొదలుకుని గర్భిణీలందరికీ సురక్షిత ప్రసవానికి, టీబి, హెచ్.ఐ.వి. వ్యాధి నిరోధకానికి, చక్కెర వ్యాధి, రక్తపోటు ఉన్న వారికి సైతం ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తారు. అందుకు తగిన మందులనూ ఉచితంగా ఇస్తారు. తదుపరి వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు అత్యవసరమైన రోగుల విషయంలో 104 వాహనాల నుండే రోగుల పరిస్థితిపై నిపుణులైన వైద్యులతో అప్పటికప్పుడే సంప్రదించి వారికి వైద్య ఏర్పాట్లు చేస్తారు.

పల్లెల్లో 104 వాహనాల ద్వారా ఉచిత వైద్యం

అన్ని రంగాలలో మహోన్నత ప్రగతిని సాధిస్తున్న ఈ శుభతరుణంలో ఆంధ్రప్రదేశ్ ... ఆరోగ్యప్రదేశ్‌గా అవతరించడానికి అనువైన అన్ని చర్యలకూ నాంది పలికింది ప్రభుత్వం. సంపూర్ణ ఆరోగ్యం అందరి సొంతమైతే అంతకు మించిన సంతృప్తి మరొకటి లేనే లేదు.

హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబరు 1800-425-7788

తెల్లకార్డు ఉంటే చాలు ఉచిత చికిత్సలు లభ్యం

Issued by I&PR

ఇంతకీ అది ఏది?

స్తాలూ... చూశారుగా. ఇక్కడ కొన్ని పాములు చుట్టుకొని వున్నాయి. ఇవన్నీ తమ పక్కనున్న పాముల తోకలు కొరుకుతున్నాయి. కాకపోతే ఒకటి మాత్రం తన తోకను తనే కొరుక్కుంటోంది. ఇంతకీ అది ఏది? గుర్తించండి చూద్దాం.



A6 B1 D4 F4 E5 C1 C4 A5



	1	2	3	4	5	6
A	B	J	P	I	N	M
B	A	Y	U	S	Q	Z
C	H	D	E	O	V	G
D	J	L	F	R	T	H
E	U	D	K	Y	T	H
F	P	W	C	A	Q	X

ఆట పేరేంటి?

న్నారులూ... ఇక్కడ ఇద్దరు పిల్లలు ఒక ఆటలో పాల్గొన్నారు. దాని పేరేంటో మీరే చెప్పాలి. ఎలాగంటే... అక్కడ ఒక అక్షరం ఒక అంకె వున్నాయికదా. కింది బాక్సులోనేమో ఓ వైపు అక్షరాలు.. మరోవైపు అంకెలు వున్నాయికదా. అక్షరం వున్న వరుసలో ఆ అంకె దగ్గర వున్న అక్షరాన్ని రాయాలి. అలా పైన ఇచ్చిన క్లూస్ అన్నిటికీ రాస్తే మీకు ఆట పేరు తెలుస్తుంది.

జవాబు: మారథాన్ (marathon)



అచ్చం ఒకేలా వున్నవేవి?

హలో ఫ్రెండ్స్! ఇక్కడ ఐదు బొమ్మలున్నాయికదా. అవన్నీ చూడ్డానికి ఒకేలా వున్నా తేడాలున్నాయి. వాటిలో రెండు మాత్రమే ఒకేలా వుంటాయి. ఒకటేమో పైనున్న పెద్ద బొమ్మ. మరి రెండోదేదో మీరే కనుక్కోవాలి.

నేర్చుకుందామా



అట్టమీది కథ

జంతుజూదం

జంతువులను 'క్రీడల్లో' వాడటం చాలాకాలం నుండే ప్రారంభమైంది. ప్రాచీన రోమ్ గుర్రాలు పూన్చిన రథాల పోటీలకు ప్రసిద్ధి. ఇప్పుడు రథాలు లేకపోయినా కేవలం గుర్రాలతోనూ, లేదా వాటిపై మోహరించిన చోదకులతోనూ పందాలు జరపటం సాధారణమైపోయింది. అయితే తేడా ఈ పోటీల వెనుక ఉద్దేశాలలోనే ఉంది. ప్రాచీన పోటీలలో క్రీడా నైపుణ్యం, శక్తి సామర్థ్యాలు చూపించే అవకాశం ఈనాటి పోటీలలో జూదానికి బలైపోయింది. అయితే అప్పుడూ, ఇప్పుడూ మాత్రం నిజంగా బలయ్యేవి నోరు లేని జీవాలే. అదే ఈ నాటి అంశం.



డా॥ కాకర్లమూడి విజయ్

పుట్టుకతోనే పగతో, ప్రతీకారంతో వున్నట్టుంది ఆ చూపు. ఈ క్షణం వదిలితే చాలు, ఆక్షణం ఎగిరి, దూకి, ప్రత్యర్థిని చిత్తు చెయ్యాలన్న ఉత్సాహం కనిపిస్తుంది. అందుకు తగ్గట్టే ఆ యోధుల్ని మెడలు దువ్వి గోదాలోకి వదిలారు. అంతే ఒకరిపై ఒకరు దూకుతూ కాళ్లతో ఒకరిని ఒకరు రక్కుతూ భీభత్సమైన పోరాటాన్ని కొనసాగిస్తుంటారు. కొంత సేపటి తర్వాత ఒక యోధుడు ఓడిపోతాడు. అన్నీ పోటీల్లోలాగే. కొన్ని సార్లు వీర మరణం పొందుతాడు కూడా చాలా యుద్ధాల్లో లాగే. కానీ మరెక్కడా లేని విధంగా ఆ యోధుణ్ణి కూర చేసుకుని తినేస్తారు యజమానులు! సంక్రాంతి సంబరాల్లో భాగంగా మన ప్రాంతాల్లో ఇటువంటి పోటీలు మామూలే. చట్టరీత్యా నిషిద్ధమైన ఈ 'కోడి పందాలు' ఇంకా కొనసాగుతూనే ఉండటం విశేషం.

కోడి పందాలు మాత్రమే కాదు. జంతువులను అనేక రకాలుగా మన సరదా కోసం వాడుకోవడం, ఆడుకోవడం, చాలా కాలంనుండి చాలా మామూలుగా ఉన్న విషయమే. రాజులు, ఆతరువాత జమిందార్లు, ఆ తరువాత సమాజంలో డబ్బు, పలుకుబడి ఉన్నవాళ్లు సరదాగా అడవి జంతువులను 'వేటాడ్డం' మనకి తెలుసు. అవి





ఇది తెల్సా!

ఒలింపిక్ క్రీడల్లో (1900 సంవత్సరంలో పారిస్‌లో) పావురాల షూటింగ్ వుండేది. గాలిలోకి ఎగరేసిన పావురాలను ఎవరు ఎక్కువ చంపితే వారే విజేతలు! అదృష్టవశాత్తు అదే ఆ ఆటకు చివరి సంవత్సరం. పంది పిల్లలతో కూడా ఒలింపిక్స్ జరిగాయి! 2005 లో చైనాలో,2006లో మాస్కోలో జరిగిన ఈ క్రీడలు 2009లో మళ్లీ జరుగుతాయి.

'ఇంకా' కొనసాగటం కూడా మనకు తెలుసు.

మేక తలే బంతి

ఆఫ్ఘనిస్తాన్ జాతీయ క్రీడ 'బుజ్ ఖాషీ' గురించి తక్కువ మందికి తెలుసు. ఈ ఆట పేరులోనే 'మేక మరణం' అనే అర్థముంది. అత్యంత ప్రాచీన కాలం నుండి సాగుతున్న ఈ క్రీడలో ఇప్పుడు మేకల బదులు దూడల్ని వాడుతున్నారు. ఈ ఆటకోసం మగ గుర్రాలనే ఎంపిక చేసుకుని వాటికి నెలల తరబడి ప్రత్యేక ఆహారం, ప్రత్యేక శిక్షణతో సిద్ధం చేస్తారు.

ఈ ఆటలో విశేషం ఏమిటంటే ఒక మేకని గానీ, దూడని గానీ, తల నరికి ఉప్పులో నానపెట్టి దానిని బంతిలాగా వాడతారు! గుర్రాలపైన ఆటగాళ్లు మైదానంలో పడివున్న ఈ కళేబర బంతిని తీసుకుని, అందర్నీ తప్పించుకుంటూ ఒక 'గోల్'లో పెట్టాలి. అదీ ఆట. అలా గోల్‌లో పెట్టనివ్వకుండా అడ్డుకోవడం కూడా ఈ ఆటలో భాగమే. ఈ మొత్తం ఆటలో 'బంతి' అక్కడక్కడ ఊడిపోయి, పనికిరాకుండా పోయేవరకూ ఆడతారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఆటను ఎంతో ఆసక్తితో తిలకించేవాళ్లు. మరింత ఉత్సాహంగా ఆడేవాళ్లూ ఉన్నారు. కొన్ని సార్లు వందమంది వరకూ ఆడతారు. గెలిచిన వాళ్లకి లభించే బహుమతి ఒక తలపాగా, ఒక కరవాలం! ఆ దూడ గురించి ఆలోచించేవాళ్లే లేరు.

పిల్లలే జాకీలు

అరబ్బు దేశాలలో మరోరకం క్రీడ అమలులో ఉంది. అది ఒంటెల పందాలు. ప్రపంచ వ్యాప్తంగా గుర్రాల పందాలు సాధారణమైతే అక్కడ ఒంటెల పందాలు సరదా. వయ్యారంగా, నెమ్మదిగా నడిచే ఒంటెలు ఈ పోటీలలో గంటకు 60 కిలోమీటర్లకు పైగా వేగంతో పరిగెడతాయి. వీటి 'జాకీ'లు చిన్నపిల్లలు. డబ్బు ఎక్కువైన అరబ్బులు ఈ పిల్లల్ని బానిసల్లాగా కొని, జాకీలుగా వాడుకొనేవాళ్లు. ఒంటెల పోటీలు ప్రారంభమయ్యే కొన్ని రోజుల ముందు నుండి ఈ పిల్లల్ని పస్తులుంచుతారు. శిక్షలా కాదు, బరువు తగ్గటానికి! మానవ హక్కుల సంఘాల గొడవతో ఇప్పుడు చిన్న పిల్లల్ని ఈ పోటీల్లో జాకీలుగా పెట్టటం తగ్గించి, రోబోలను వాడుతున్నారు. కానీ జంతుహక్కుల సంఘాలు లేకపోవడంతో ఒంటెలు మాత్రం అనవసరంగా శ్రమపడుతూనే ధనవంతునికి సరదా అందిస్తున్నాయి.

శనకాల పరుగు పందాలు

కుక్కల్ని మనకు తోడుగా, కాపలా కోసం పెంచుకోవడం మనకు తెలుసు. కానీ గ్రేహౌండ్ అనే జాతి కుక్కలతో పరుగు పందాలు నిర్వహిస్తారన్నది చాలా మందికి తెలీదు. చాలా దేశాలలో ఈ కుక్కల పోటీలు కేవలం సరదాకే జరిపినా, అమెరికా, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఇంగ్లాండ్ వంటి దేశాలలో వీటిని జూద స్థాయిలో నిర్వహిస్తారు. ఈ కుక్కల్ని అతి జాగ్రత్తగా, ప్రత్యేకంగా పెంచుకుంటారు కూడా.

అయితే కుక్కల పరుగు పందాలు కాకుండా కుక్కల పోట్లాటల పోటీలు కూడా జరుగుతాయి. దాదాపు పదహారవ శతాబ్దం నుండీ ఇటువంటి పోటీలు జరుగుతున్నాయని తెలుస్తుంది.

ఈ కుక్కల పోట్లాట చాలా దేశాలలో ఆటలా కొనసాగుతుంది. కొన్నింట్లో చట్టబద్ధంగానే! కోడి పందాలలో కోళ్ళలాగే, ఈ పోటీలలో కుక్కలు





శునక భోగం

అన్ని జంతువుల్లోకి మనుషులకు అత్యంత సన్నిహితంగా వారి జీవితాల్లో భాగంగా అత్యున్నత స్థాయిని పొందగలిగింది శునకమే. కేవలం తమకు నచ్చిన విధంగా అనేక కుక్క జాతుల్ని 'సృష్టించి' పెంచుకుంటున్నారంటేనే వాటి ప్రాముఖ్యత అర్థమౌతుంది. కుక్కలకు తమ కుటుంబ సభ్యుల్లాగే చూసుకోవడం, వాటితో మనుషుల్లాగే ప్రేమానురాగాలు, భావోద్వేగాలూ పంచుకోవడం మామూలే. కొన్ని కుక్కలు మనుషుల కంటే ఎక్కువ ప్రాముఖ్యతను చూరగొన్న సందర్భాలూ ఉన్నాయి.

రక్తసిక్తమై, కొన్ని సార్లు చనిపోతాయి కూడా. జంతువుల పట్ల హింస ఉండకూడదనే చట్ట ప్రకారం కొన్ని దేశాలు వీటిపై నిషేధం విధించినా, జరిగేవి జరుగుతూనే వున్నాయి.

రెచ్చగొట్టి గాయపర్చడమే ఆట

స్పెయిన్, పోర్చుగల్ దేశాలలో అత్యంత ప్రాచుర్యం పొందిన క్రీడ బుల్ ఫైటింగ్. ఈ ఆటలో అటు ఆటగాడూ (టొరిరో లేదా మాటాడార్) ఇటు ఎద్దు చనిపోయే అవకాశాలున్నాయి. ఎద్దుని రెచ్చగొట్టి, ఒక పద్ధతి ప్రకారం గాయపర్చటం ఈ క్రీడ. ఈ ఆట ఆడే మెక్సికో, స్పెయిన్, పోర్చుగల్, దక్షిణ ఫ్రాన్స్, లాటిన్ అమెరికాలలో ఇదొక సంప్రదాయ స్థాయిలో ఉంది. కానీ జంతు ప్రేమికులు మాత్రం ఈ క్రీడను నిషేధించాలని వాదిస్తున్నారు చాలా కాలం నుండీ.

ఒంటెల కుస్తీ

స్పెయిన్‌లో ఎడ్ల పోరాటం, ఇంగ్లీష్ వాళ్లు హౌండ్ కుక్కలతో వేట, ఇటాలియన్లు, ఇండియన్లు కోళ్ల పందాలు వుంటే టర్కీలో ఒంటె పోరాటాలు జరుగుతాయి. (అరబ్ దేశాల్లోలా ఒంటెల పరుగు పందాలు కాదు- ఏకంగా కుస్తీలే). అంటే , ఇవి నిజంగా కుస్తీలు కావు. సాధారణంగా ఒంటెల గుంపులో మగ ఒంటెలు, ఆడ ఒంటె కోసం పోట్లాడటం మామూలే. దాన్నే మన ఆనందం కోసం ప్రత్యేకంగా పోటీలా అభివృద్ధి చేసింది టర్కీయులే.

ఈ పోటీలు టర్కీలో పండగ వాతావరణాన్ని తలపిస్తాయి. పోటీ ముందు రోజు ఒంటెల్ని అలంకరించి, మేళ తాళాలతో వీధుల్లో ఊరేగిస్తారు. ఒకప్పుడు వందల ఒంటెలు పాల్గొన్న ఈ పోటీలు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. ఒంటెల పోట్లాట సంగతి అటుంచితే, అవి ఒకదాన్నొకటి తోసుకునే క్రమంలో చూసేవాళ్లు గాయపడ్డ సందర్భాలు చాలా వున్నాయి. పైగా ఒంటెలు సహజంగా ఆవేశంలో ఉన్నప్పుడు విపరీతంగా ఉమ్మడం చేస్తాయి. ఈ పోటీలు చూసేవాళ్లకు అదొక చిరాకు. విశేషమేంటంటే ఈ 'కుస్తీ' లో ఒంటెలు గాయపడవు. అయినా, పోటీల కోసం వాటిని విపరీతంగా మేపడం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అవడంతో ఈ పోటీలు తగ్గుముఖం పడుతున్నాయి.

ఆవుల పోరాటం

మన ప్రాంతాల్లో అక్కడక్కడా గొర్రెల పోట్లాటలు నిర్వహిస్తుంటాం. అలాగే స్విట్జర్లాండులో ఆవు పోట్లాటలు జరుపుతారు! స్పెయిన్‌లో బుల్‌ఫైట్‌లో ఎద్దులతో మనుషులు ఢీ కొంటే ఇక్కడ ఆవులు ఆవులతోనే పోరాడతాయి. ఏటా అర లక్ష సందర్శకులను ఆకర్షించే ఈ 'క్వీన్ ఫైట్లు' 1920 నుండి ప్రజాదరణ పొందుతున్నాయి. ఈ పోటీల కోసం ఆవుల్ని ప్రత్యేకంగా మేపడమే కాకుండా వాటి కొమ్ములను కోసేస్తారు. బరిలో ఉన్న ఆవులు ఒకదాన్నొకటి తోసుకుంటూ ఉంటాయి. అలా వెనక్కి వెళ్లిన ఆవుని పోటీలో నుండి తప్పిస్తారు. ఒక్కో పోటీ దాదాపు అరగంటకు పైగానే ఉంటుంది.

బుల్ సుమో



ఇటువంటిదే జపాన్‌లో 'బుల్ సుమో'. దీనినే టోగ్యు అనీ అంటారు. పదిహేడవ శతాబ్దంనుండీ వస్తున్న ఈ క్రీడ విపరీతంగా ప్రాచుర్యం పొందింది. ఒకానొక దశలో దీన్ని చూస్తూ ప్రజలు పనీ పాటలు మానేశారన్న కారణంగా నిషేధించారు కూడా! రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత ఈ క్రీడ పునఃప్రారంభమైంది. ఈ పోటీలలో విశేషమేమిటంటే ఎడ్లను ఏ మాత్రం గాయపడనీకుండా ఒక 'కోచ్' పర్యవేక్షిస్తుంటాడు. ఇదే తరహాలో ఉత్తర పోర్చుగల్‌లో ఛెగాస్ అనే ఆట జరుగుతుంది.

ఏనుగులతో పోలో...

గుర్రాలతో పోలో ఆడటం మనకి తెలుసు. కానీ ఏనుగులతో పోలో తెలుసా? ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలో ఆంగ్లేయులు వెరైటీ కోసం ఆరంభించిన (మన దేశంలోనే!) ఏనుగులతో పోలో ఇప్పుడు నేపాల్‌లో ఏటా ఛాంపియన్‌షిప్‌లు జరుగుతున్నాయి.

కీటకాలనూ వదల్లా

ఇక చైనా, థాయ్ లాండ్‌లలో కీటకాలతో క్రీడలు నిర్వహిస్తారు. పైగా ఆ కీటకాలని ఎక్కువగా కీచురాళ్లను - తర్ఫీదు ఇచ్చిమరీ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో బలహీనమైన కీటకం సాధారణంగా చనిపోతుంది. అలాగే ఫిలిప్పీన్స్‌లో సాలెపురుగుల పోటీ జరుగుతుంది.

ఇవన్నీ కాక యాక్ (జడలబర్రె) స్కియింగ్ అనీ, ఆక్టోపస్ కుస్తీ అనీ, ఎలుకల పరుగు పందాలు, కుందేళ్ల పందాలు... ఇలా ఎన్నో రకాల ఆటల్లో జంతువులను వాడుతున్నారు.

ఆటవిడుపు కోసమే...!

మానవుడు ఆహ్లాదం కోసం అర్రులు చాస్తూ ఎన్నో రకాల ఆటవిడుపు కిటుకులను కనుగొన్నాడు. తనంతట తానే, తనతోటి వారితో ఆడుకోవడమే కాక తన సహ జీవులైన

జంతువులనూ 'ఆట' పట్టించాడు. అటువంటి ఆటలో కొన్ని నిజంగానే నిరపాయకర ఆనందాన్ని ఇస్తే కొన్ని హింసాత్మకంగా, బీభత్సంగా భయంకరంగా, రక్త సిక్త ఫలితాలతో ఒక విధమైన పైశాచిక ఆనందాన్ని ఇస్తున్నాయి.

మానవుడిలో ఎక్కడో దాక్కున్న ఆ పైశాచిక ప్రవృత్తిని తృప్తి పరచటానికి ఈ తరహా రక్త క్రీడలు ప్రాచీన కాలం నుండీ అంతరిక్ష యుగం వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. ఇది తప్పు. మానవత్వం ఉన్న (?) మనుషులు ఈ క్రీడల్ని తిరస్కరించాలి. నిషేధించాలి అని జంతుహక్కుల కోసం పోరాడే వాళ్లు పోరాడుతూనే ఉన్నారు. ఇవి జరుగుతూనే ఉన్నాయి.

అరణ్యాలలోని అమాయక జీవుల్ని 'వేట' అనే 'ఆట' కోసం చంపి ప్రకృతిలో క్రూరజంతువులంటే మనమే అని నిరూపించిన మానవుణ్ణి ఏ బోధలు మారుస్తాయి? ఏ నీతులు నడిపిస్తాయి? తోటి మనిషినే జంతువులా పరిగణించే వాడికి అసలు జంతువులొక లెక్కా? శాంతి కపోతపు తెల్లని ఈకల కింద ఎర్రని మాంసాన్ని మాత్రమే చూడగలిగే ఆధునిక అర్జునుల కాలంలో హంసకు ప్రాణదానం చేసిన సిద్ధార్థులు రారు. మూగజీవి మూపురంలో సూదంటు శూలాలను గుచ్చి గుచ్చి చంపే క్రీడాగ్రేసరుల విన్యాసాలు చూసి ప్రోత్సహించే వారు అలసిపోరు. జంతు క్రీడలలో రక్తం ఇంకిపోదు. కాకపోతే మనలోని మానవత్వం మిగిలివుంతో లేదో.... చూడాలి.

మంచివా, చెడ్డవా?

మతాలు, ఆచార వ్యవహారాలు, ప్రాంతాల రీత్యా కొన్ని జంతువులు మానవులకు పవిత్రమైనవిగానూ, అపవిత్రమైనవిగానూ మారిపోయాయి. మన వాళ్లకు పిల్లి అపశకునం - ఇతరులకు అది బోజ్యనీయం. ఒకానొక మతస్థులకు పంది నీచాతినీచం - కొంత మందికి అది అతి రుచ్యం. ఎలుకలు మనకు అసహ్యం, ఆగ్నేయాసియాలో అవి ఆహారం. పాములు అతి ప్రమాదకరం - అవి కొంత మందికి పూజ్యనీయం, కొంతమందికి జీవనోపాధి, ఇంకొంతమందికి రుచికరమైన ఆహారం.

✠

మనమూ - ఇతర జీవులు

మనుషులకీ పశుపక్ష్యాదులకీ ఒక రకమైన అవ్యక్త సంబంధం ఏనాటినుండో వుంది. బహుశా మానవుడు ఆవిర్భవించే సమయానికే అన్ని రకాల జంతువులు, పక్షులు ఉండటం వల్ల అతను వాటితో ఏదో రకంగా సంబంధం పెంచుకున్నాడు. కొన్నిటిని ఆహారంగా చూస్తే, కొన్నిటిని దేవుళ్లలా , ఇంకొన్నింటిని పవిత్రంగా చూసుకున్నాడు. ఈ క్రమంలో ఎక్కడో కొన్ని జంతువులను పెంచుకోవడం ప్రారంభించాడు. వాటితో తన పనులను చేయించుకోవడం, తనకు తోడుగా వుంచుకోవడం మొదలైంది. నాగరికత పెరుగుతున్నకొద్దీ ఈ సంబంధాలు మరింత పెరిగాయి. ఆహార అవసరాలు (పాలు, గుడ్లు, మాంసం), రక్షణ (ఎముకలు, చర్మం, ఉన్ని) , అలంకరణ (కొమ్ములు, ఈకలు), ఔషధాల వరకు ఎన్నో రకాలుగా జంతువులు, పక్షులు మానవునికి తోడ్పడుతూ వస్తున్నాయి.

ఇందులో భాగంగానే మనిషికి వాటిని 'సరదాకి' పెంచుకోవాలనే కోరిక ప్రారంభమైంది. దాంతో అందమైన వాటిని, నిరపాయకరమైన వాటిని సేకరించటం మొదలైంది. ఈ నాడు మానవులు పెంచుకోని జంతువులు, పక్షులు చాలా తక్కువనే చెప్పవచ్చు. భయంకరమైన విష సర్పాల నుండి క్రూరమృగాల వరకు, గొంగళి పురుగుల నుండి కప్పల వరకు, ఊరపిచ్చుకల నుండి గద్దల వరకు - అనేక జీవులను పెంచుకోవడం ఒక 'హాబీ'గా మారింది.

స్వేచ్ఛగా ఉండవలసిన జీవాలను పంజరాలలో బంధించి, 'హింసించటం' (శారీరకంగా ప్రత్యేకంగా హింసించక పోయినా నిర్బంధమే హింసగా పరిగణించబడుతోంది) జంతు ప్రేమికులకు కంటకింపుగానే ఉన్నా ఈ 'పెంచుకోవడం' పెరుగుతూనే ఉంది. కొన్ని రకాల పక్షులను, జంతువులను పెంచుకోవడం చట్టరీత్యా నేరం కూడా.

హైదరాబాద్‌లోని చార్మినార్ దగ్గరలో చిడీబజార్/ముర్గీ చౌక్ లో ఆస్ట్రేలియాలో కనిపించే 'లవ్ బర్డ్స్' నుండి ఊరపిచ్చుకలు, చిలుకలు, పావురాళ్లు, కాకులు, కుందేళ్లు, దొంగతనంగా తాబేళ్లు కూడా అమ్మకానికి సిద్ధంగా ఉంటాయి. రోజు వేలాది రూపాయల వ్యాపారం జరుగుతుంది కూడా. ఇక్కడనుండి పక్షుల్ని తీసుకెళ్లి, పెంచుకుంటూ, వాటి సంతానం పెరగగానే మళ్లీ ఇక్కడికే తీసుకొచ్చి అమ్మే వాళ్లున్నారు.

ఇలా జంతువులను, పక్షులను పెంచుకోవడం వల్ల వాటికి ఇబ్బంది కలగనంత వరకూ తప్పులేదంటారు కొంతమంది. అవి నిజంగా 'కావలా' కాయకపోయినా కుక్కపిల్లల్ని, పిల్లుల్ని పెంచుకోవడం తప్ప కానప్పుడు మిగతా జంతువులనూ ఎంచక్కా పెంచుకోనివ్వవచ్చన్నది వారి వాదన. అయితే, ఇక్కడ సమస్య స్వేచ్ఛ పంజరాల్లో ఉంచడమంటే వాటి స్వేచ్ఛను హరించటం కాబట్టి తప్పు. స్వేచ్ఛగా వదిలినా 'పెంపుడు' గా ఉండే పావురాల వంటి వాటిని పెంచడం వల్ల ఇబ్బంది లేదంటారు.

అయితే ఈ పెంపుడు వ్యవహారం వ్యక్తిగత ఇష్టాయిష్టాల బట్టి ఉంటుంది. కొందరికి పిల్లులంటే అసహ్యం, కొందరికి ఎలుకలంటే ప్రాణం. కాకపోతే ఎంత ఇష్టమున్నా క్రూరజంతువులను, రక్షిత జంతువులను, అరుదైన జాతులను పెంచడం, పెంచే ప్రయత్నం చేయుటం కూడా శిక్షార్హమే.

ఒకప్పుడు సర్కస్‌లలో జంతువులను, పక్షులను అనేక విన్యాసాలు చేసి సందర్శకులకు ఆనందం కలిగించడం కొరకు వినియోగించేవాళ్లు. ఇప్పుడు అటువంటివి తగ్గిపోయాయి. ఇంటింటికీ తిరిగి అడుక్కునే ఎలుగుబంట్ల వాళ్లూ కోతులాడించే వాళ్లూ తగ్గిపోయారు. పాములోళ్లూ కనుమరుగయ్యారు.

మనదేశంలో 'ఎవ్వరికీ చెందని' కుక్కలు వీధుల్లో వీరవిహారం చేయుడం, ఎవరివో తెలియని ఆవులు, ఆబోతులు రోడ్డుకడ్డంగా కూర్చోవడం సాధారణంగా కనిపించే దృశ్యాలు. వాటిని తరలించడానికీ బ్లూక్రాస్ వంటి జంతు ప్రేమికుల సంస్థలు కొన్ని నిర్ధారిత పద్ధతులను ప్రవేశపెట్టాయి.

జీవశాస్త్రం అధ్యయనం చేసే విద్యార్థులకు బొద్దింక, వానపాము, కప్పల విచ్ఛేదనం (డిసెక్షన్) ఒకప్పుడు అత్యావశ్యకమైన అంశం. జంతు ప్రేమికుల ఉత్సాహం కారణంగా ప్రస్తుతం కప్పల బలికి విముక్తి కలిగింది.

బలి అంటే ఎన్నో యుగాలుగా ఆచార స్థాయిని అందుకున్న జంతుబలి గుర్తుకు వస్తుంది. ఈనాటికీ కోళ్లనో, మేకలనో, గొర్రెలనో బలి ఇవ్వడం పరిపాటే. 'దేవతల'ను మంచి చేసుకోవడానికో, జరిగిన మంచికి కృతజ్ఞతా సూచికంగానో బలులు అర్పించడం చరిత్రకు పూర్వం నుండి వున్నట్లు మనకు తెలుసు.



చూద్దామా...

గత వైభవచిహ్నం శ్రీరంగపట్నం

కోట శిథిలమైపోయినా గతకాలపు గుర్తులు అక్కడ తారాట్లాడుతున్నాయి. ఆనాటి వైభవాన్ని, ప్రాభవాన్ని లీలగా ఒక్కసారి గుర్తుచేసుకున్నాం. అందులో టిప్పుసుల్తాన్ నివశించేవాడు. సంగీతకారుల ఆలాపనలు...జతకలిసే వాయిద్యాలు...నర్తకీమణుల నాట్యాన్ని ఆస్వాదిస్తూ...తన రాణులతో సేదతీరేవాడని ఊహించుకుంటే వొళ్లు గగుర్పొడిచింది. సామాన్య మానవునికి ఆ రోజుల్లో ప్రవేశమే ఉండేది కాదు. నేడు మనం యదేచ్ఛగా విహరిస్తున్నాం. కాలం తెచ్చే మార్పు చూశారా! ఈనాడు మన సొంతం, దీనిపై మనదే సర్వాధికారమని దేన్నైతే చూసుకుని విర్రవీగుతామో, అది రేపెవరికో చెందుతుంది. ఈమాత్రం దానికే పగలు, ప్రతీకారాలు, ఈర్ష్యాద్వేషాలు, స్వార్థ ప్రయోజనాలతో నాలుగురోజుల జీవితాన్ని, అందులోని మాధుర్యాన్ని కాలరాచుకుంటున్నాం. శిథిలాలు చూసి పాఠాలు నేర్చుకోవచ్చన్నమాట!

అరుణ.కె


శ్రీరంగపట్నం రంగనాథ ఆలయం

శ్రీరంగపట్నమనగానే టిప్పుసుల్తాన్ రాజధాని అని అందరికీ గుర్తుండే ఉంటుంది. చిన్నప్పుడు క్లాసు పుస్తకాలలో బట్టీపట్టాంకదా మరి. ఆ శ్రీరంగపట్నం మైసూరుకి దగ్గర్లోనే ఉంది. అక్కడ టిప్పుసుల్తాన్ మ్యూజియం, ఆయన ప్రార్థనచేసిన మసీదు ఉన్నాయి. వాటిపక్కనే 'వాటర్‌గేట్' అనే చెరువు ద్వారం కనపడింది. ఆనాడు టిప్పుసుల్తాన్ మన తాండ్రపాపారాయుని రైపులో ఆంగ్లేయులను గడగడలాడించాడని మీకు తెలుసు కదా! అలాంటి టిప్పుసుల్తాన్‌ను ఎలా లొంగదీయాలో తెలీక ఆంగ్లేయులు వారికి బాగా అలవాటయిన, తెలిసిన పద్ధతినే పాటించారు. వారు చెరువు ద్వారం వద్ద కాపలా కాసే సైనికుని లొంగదీసుకుని చెరువుగుండా ఈదుకుని కోటలోనికి ప్రవేశించి టిప్పుసుల్తాన్‌ను బంధించారట. తర్వాత టిప్పుసుల్తాన్‌ను ప్రజలందరి యెదుటా నిల్చుండబెట్టి నిలువునా కాల్చిచంపారట. వాటర్‌గేట్ పక్కనే టిప్పుసుల్తాన్‌ను కాల్చిన ప్రదేశముంది. ఇదంతా వింటుంటే ఒళ్లు గగుర్పొడిచింది. ఎందరో ప్రాణాలొడ్డి సంపాదించిన స్వాతంత్ర్యాన్ని మనమేరీతిన దుర్వినియోగం చేస్తున్నామని బాధనిపించింది. ఆనాడు రాజులు రాజ్యమేలి, వైభవాన్ని చూరగొన్న పట్టణాలు నేడు గత వైభవచిహ్నాలుగా మిగిలిపోవడం చూస్తే ఎవరికైనా మనసు నొచ్చుకుంటుంది.

శ్రీరంగపట్నమంటే టిప్పుసుల్తాన్ రాజధాని మాత్రమే కాదు. రంగనాథుని ఆలయమున్న ప్రదేశం. ఇలా చెప్తే కాదు గానీ, మీరు 'దశావతారం' సినిమా చూశారా? అందులో కమల్‌హాసన్‌ను, రంగనాథుని ఇనుపగొలుసులతో బంధించి సముద్రంలో పడేస్తారుకదా! ఆ అర్థనిమీలనేత్రుని రంగనాథ విగ్రహం శ్రీరంగపట్నంలోనిదే! అంటే అలాంటిది! ఎందుకోగానీ...కమల్‌హాసన్‌కు రంగనాథుడంటే ఇష్టం. 'మహానది' సినిమాలో 'శ్రీరంగ రంగనాథుని దివ్య...' అనే పాటను ఈ గుడి ఆవరణలోనే చిత్రీకరించారు. గుడి చాలా విశాలంగా, అందంగా ఉంది. ఆలయప్రాకారం చాలా ఎత్తైనది. రంగనాథుని పక్కనున్న ఆలయంలో రంగనాయకి


ఓంకారేశ్వర స్వామి ఆలయం

శృంగేరి దేవాలయం

శృంగేరిలో దసరా ఉత్సవాలు


మంజీరాబాద్ ఫోర్ట్

ముగ్ధమనోహరంగా కొలువుతీరింది. ఆలయంబైట స్వామిని ఊరేగించే రథం చిన్నగా ఉన్నా బాగుంది.

జనసందోహం...శృంగేరీ ఆలయం

ఆ ఊరు దరిచేరేంతవరకూ చెట్టూపుట్టా తప్ప పురుగు కనిపించలేదు. సమీపించగానే, జనసందోహం పట్టణమంతా అలముకొనుంది. దసరా ఉత్సవాలు జరుగుతుండటంతో ఒకటే కోలాహలం. రకరకాల వేషధారణల్తో, వాయిద్యాలతో సందడి సృష్టిస్తున్నారు. స్త్రీలు, పిల్లలు రసరమ్య గీతాలను ఆలపిస్తున్నారు. మొత్తానికి పండగ వాతావరణమంటే ఇదేననిపించింది. ప్రజలంతా ఉత్సాహంగా నడుస్తుండగా వారి వెనుకగా దేముడి ఊరేగింపు వచ్చింది. ఆ సందడిని అవలోకించి ఆలయంవైపుకు అడుగులేశాం. అది అచ్చం బేలూరు ఆలయంలానే ఉంది. ద్వారానికిరువైపులా రాతిగొలుసులున్నాయి. రాతిని రింగులురింగులుగా చెక్కారన్నమాట! గర్భాలయంలోని స్తూపాలకున్న సింహాలు నోళ్లు తెరిచి వున్నాయి. లోపల క్రికెట్ బంతులలంత రాతిబంతులు కదుపుతుంటే గుండ్రంగా తిరుగుతున్నాయి. చూస్తే భలే ఆశ్చర్యమేసింది. దానికెంత ఓర్పు కావాలి? అన్నీ తెలిసిన వాళ్లమని తెగ విర్రవీగుతాం గానీ ఆనాటి శిల్పుల చాతుర్యంతో పోలిస్తే మనమేపాటి!

ఆలయం పక్కగా కావేరీ నది ప్రవహిస్తుంది. అక్కడ చేపలు పట్టనివ్వరట. భక్తులంతా ఆహారం వేస్తుడటంతో ఒడ్డునే గుంపులుగా ఈదులాడుతున్నాయి. ఆలయంబైట చాలా ఏనుగులున్నాయి. వాటికి డబ్బులిస్తేనే ఆశీర్వదించేలా తర్ఫీదునిస్తారట. సాధారణంగా ఉత్సవ సమయంలోనే ఏనుగులకు చిరాకుపుట్టి రెచ్చిపోయి, భీభత్సం సృష్టిస్తాయని, మనుషుల్ని కాళ్లకింద నలిపేస్తాయని విన్నాం కదా! ఎందుకొచ్చిన గొడవని పిల్లలను పంపలేదు. ప్రసాదం కొనుక్కుని బైటకొచ్చాం. రోడ్లన్నీ రకరకాల దుకాణాలతో హడావిడిగా ఉంది. అవన్నీ చూసుకుంటూ మధ్యలో ఒకచోట చక్కని భోజనంచేసి మరో ప్రదేశానికి పయనమయ్యాం.

నిండునదిలో మునకలు...దుబేరా ఫారెస్ట్

కావేరీనది సౌందర్యమంతా 'దుబేరా ఫారెస్ట్'లో కనపడుతుంది. చిక్కని అడవి, మధ్యలో రాళ్ల మధ్య ప్రవహించే దృశ్యం నయనమనోహరంగా ఉంది. అక్కడికెళ్లాక వాతావరణం కొత్తరూపు సంతరించుకుంది. వనదేవత వయ్యారాలు పోతూ అల్లనల్లన నడిచిన భావన! ఆమెకై చల్లని పవనాలు వెదజల్లుతున్న మత్తైన గుభాళింపుల వింజామరల వీవెన! ఆమె జారవిడిచిన శిరోజాలవలె దారంతా వెదురుపొదలు వింత సోయగంతో ఊగిసలాడుతుంటే చూడటానికి రెండు కళ్లూ సరిపోలేదు. అక్కడ ఇంకేమీ గుర్తురాలేదు. ప్రకృతి, మనం అంతే!

అక్కడ బోటింగ్ ఉంది. ఒకటి నూటపాతిక, మరోటి పాతిక...ఇంతమందికి తక్కువది చాల్లే అనేసుకుని అందరం ఎక్కేశాం. వాడు అవతలి ఒడ్డుకు తీసుకెళ్లి ఆపాడు. అది ఏనుగులకు తర్ఫీదు ఇచ్చే ప్రదేశమట. కానీ ఒక్క ఏనుగుంటే ఒక్కటి కూడా కనిపించలేదు! అన్నిటినీ మైసూరులోని దసరా ఉత్సవాలకు తరలించారట! సరే కాసేపు అటూ ఇటూ తిరిగాం. తర్వాత రాళ్ల మధ్యగా చిరుసవ్వడి చేసుకుంటూ ప్రవహిస్తున్న కావేరీలో ఆటలాడాం. అంత స్వచ్ఛమైన నీటిలో, అదో పసరు వాసన వచ్చే అడవిలో ఆడుకోవడం 'అహ ఏమి హాయిలే హల...'! ఓ గంట గడిచాక, పెద్దలు చిన్నగా మందలించాక మెల్లగా లేచి తిరుగు బోటెక్కాం. కానీ అక్కడికెళ్లాక పిల్లలంతా 'రాఫ్టింగ్'కు వెళ్దామని గోలచేశారు. మళ్లీ మళ్లీ వస్తామేంటీ, ఖర్చుకు వెనకాడితే ఎలాగని మొత్తానికి ధైర్యం చేసేశాం. మనిషికి నూటపాతిక చెల్లించి రెండు బోట్లెక్కాం. వాళ్లందరికీ లైఫ్ జాకెట్లిచ్చి వేసుకోమన్నారు. అందరం తెడ్లు వేసి పడవను నడపాలి. పడవతనికి డబ్బిచ్చాక కూడా మనమే పడవ నడుపుకోవాలా? సర్లే ఇదో ఎక్స్‌పీరియన్స్ అనుకుంటూ నడిపాం. వాళ్లు పొదల మాటునుండి, రాళ్లమీదనుంచి తీసుకెళ్తూ మమ్మల్ని హుషారుపరచారు. అరగంట తర్వాత నదిమధ్యకు తీసుకెళ్లి దూకమన్నారు. ఈత రానివాళ్లని దూకమంటారేంటీ అంటే, మునిగిపోరు దూకమన్నారు. ఇంకేమీ ఆలోచించకుండా దూకేశాం. దూకేయడమైతే దూకాంగానీ, మునిగిపోతున్నామని ఒకటే ఆందోళన, భయం. ఊపిరాడనట్లనిపించింది. వచ్చి కాపాడమని కేకలు వేస్తుంటే బోట్ నడిపే అబ్బాయి కదలడే! తాపీగా చూస్తూ కూర్చున్నాడు. కాసేపటికి మేమలా తేలడానికి అలవాటు పడ్డాం. మెల్లగా ఎంజాయ్ చేయసాగాం. అప్పుడర్థమైంది ఆ అబ్బాయి ఎందుకలా తాపీగా కూర్చున్నాడో! ఇలాంటోళ్లని ఎంతమందిని చూశాడో మరి! అలా తేలిపోతూ ప్రవాహం వాలుకి కొట్టుకుపోతుంటే భలే గమ్మత్తుగా ఉంది. దాన్ని వర్ణించతరం కాదు, స్వయంగా తెలుసుకోవాల్సిందే! చివరికి రమ్మని మొత్తుకుంటున్నా, ఒక్కరూ ఉలకరే! చివరికి టైమయిందని మొత్తుకుంటే బోటెక్కాం. అప్పుడనుకున్నాం. రేటెక్కువని వెళ్లకపోతే ఎంత మిస్సయ్యేవాళ్లమోనని. మొత్తానికి పిల్లలు, పెద్దలు బాగా ఎంజాయ్ చేసిందీ, మర్చిపోలేనిదీ రాఫ్టింగ్‌నే!

కువెంపు గృహం

సుందరమైన కువెంపు గృహం

తిరుత్తహళ్లిలోని మహాకవి కువెంపు నివాసాన్ని సందర్శించడం చిత్రంగా



జరిగింది. కాస్త గాలి పీల్చుకుందామని వెహికల్ ఆపి అందరం దిగాం. తిరిగి ఎక్కబోతుంటే కుడివైపొక బోర్డు కనిపించింది. 'కువెంపు గృహానికి మార్గం'అని! ఏంటని డ్రైవరునడిగితే కర్నాటకలో గొప్పకవి నివాసమని చెప్పాడు. సరే అటు పోనియ్యమన్నాం. రాళ్లతో కట్టిన ద్వారబంధాన్ని దాటితే వెదురుపొదల మధ్య తోవ కనిపించింది. అక్కడ విశాలమైన ప్రాంగణంలో సుందరమైన పెద్ద పెంకుటిల్లుంది. ఆ మూడంతస్థుల పెంకుటిల్లు పోకచెట్లతోటల మధ్యన హుందాగా నిల్చునుంది. లోపలంతా టేకుతో నిర్మించారు. లెక్కలేనన్ని గదులు, వాటి నిండా ఆనాటి వస్తువులు, పాత్రలు, వ్యవసాయ పనిముట్లు... అన్నీ సందర్శనార్థం ఉంచారు. కవి 'కువెంపు' జ్ఞానపీఠ అవార్డు గ్రహీత. ఆయన 82 నవలలు రాశారు. అవికాక కవితలు లెక్కలేనన్ని. ఆ ఇంటిలో ఆయన పొందిన అవార్డులు, నవలలు, దుస్తులు...అన్నీ వరసగా అమర్చారు. ఆయన తన రచనలను ఇంటి నుండి కొంత దూరంలోనున్న కొండ శిఖరాన కూర్చుని రాసేవారట. చుట్టూ పచ్చని ప్రకృతి, కొండాకోన, వీచేగాలి...మనసు పట్టరాని పారవశ్యానికి లోనైతే కవిత్వం ఆశువుగా తన్నుకొచ్చేదేమో!

మనసు దోచిన మంజీరాబాద్ ఫోర్ట్

ఇలా అనుకోకుండా చూసి ముచ్చటపడిన ప్రదేశం ఇంకోటుంది. వెళ్తూ ఉంటే దోణిగల్‌లో చిన్న బోర్డు కనిపించింది. ఏంటని ఆరా తీస్తే అది 'మంజీరాబాద్ ఫోర్ట్' అని, టిప్పుసుల్తాన్ విశ్రాంతి భవనమని చెప్పారు. సరేకదా చూద్దామని మెట్లెక్కుతుంటే ఎంతకీ తరగవే! 'ఈయనగారికి రెస్ట్ తీసుకోవడానికి ఇక్కడే దొరికిందా? అవున్లే ఈయన సొమ్మేంపోయింది? పల్లకీలో ఎక్కి కూర్చుంటే మోసుకెళ్లేవారేమో!' అనుకుంటూ, ఒగుర్చుకుంటూ మొత్తానికి వందల మెట్లు అధిరోహించాం. అలసట తీర్చుకుని చుట్టూ చూసేసరికి అర్థమయింది, రాజా వారు ఇక్కడే విశ్రాంతి భవనాన్ని ఎందుకు కట్టుకున్నాడో (కట్టించాడో!) అంత పెద్ద పర్వతశిఖరాన కోట కట్టి, చుట్టూ ఎత్తైన ప్రాకారం, లోతైన కందకం నిర్మించారు. చుట్టూ కానొచ్చిన పర్వత సముదాయం, చిక్కని అడవి మమ్మల్ని మంత్రముగ్ధుల్ని చేశాయి. ఆ ప్రశాంతతను నిశ్శబ్దంగా జ్ఞాపకాల్లో గూడుకట్టుకున్నాం. కోట ప్రాంగణం మధ్యగా నాలుగువైపులా మెట్లుండే దిగుడు బావుంది. వర్షపు నీరు అందులో చేరేలా అన్నమాట! అదికాక రెండు సొరంగాలున్నాయి. అందులో ఒకటి శ్రీరంగపట్నానికి, రెండవది మైసూరుకు ఆ సొరంగమార్గాలని అక్కడివారు చెప్పారు. కానీ నమ్మబుద్ధి కాలేదు. ఇన్ని వందలమైళ్లు, పైగా అన్ని కొండలను ఎలా తవ్వుతారబ్బా? పైగా రెండు పట్టణాలకు వెళ్లే మార్గం ఒకటే! దానికోసం రెండు సొరంగాలెందుకు తవ్వుతారు? గత చరిత్ర ఇంతుంటే అంత చెప్పుకోవడం మనకలవాటేగా! అలానే వింటున్నాం కదాని చెప్తున్నార్లే అని నవ్వుకున్నాం.

కోట శిథిలమైపోయినా గతకాలపు గుర్తులు అక్కడ తారాట్లాడుతున్నాయి. ఆనాటి వైభవాన్ని, ప్రాభవాన్ని లీలగా ఒక్కసారి గుర్తుచేసుకున్నాం. అందులో టిప్పుసుల్తాన్ నివసించేవాడు. సంగీతకారుల ఆలాపనలు...జతకలిసే వాయిద్యాలు...నర్తకీమణుల నాట్యాన్ని ఆస్వాదిస్తూ...తన రాణులతో సేదతీరేవాడని ఊహించుకుంటే వొళ్లు గగుర్పొడిచింది. సామాన్య మానవునికి ఆ రోజుల్లో ప్రవేశమే ఉండేది కాదు. నేడు మనం యథేచ్ఛగా విహరిస్తున్నాం. కాలం తెచ్చే మార్పు చూశారా! ఈనాడు మన సొంతం, దీనిపై మనదే సర్వాధికారమని దేన్నైతే చూసుకుని విర్రవీగుతామో, అది రేపెవరికో చెందుతుంది. ఈమాత్రం దానికే పగలు, ప్రతీకారాలు, ఈర్ష్యాద్వేషాలు, స్వార్థ ప్రయోజనాలతో నాలుగురోజుల జీవితాన్ని, అందులోని మాధుర్యాన్ని కాలరాచుకుంటున్నాం. శిథిలాలు చూసి పాఠాలు నేర్చుకోవచ్చన్నమాట!

ఇంకా హారంగీ డ్యామ్, అమరావతి వంటి ఓంకారేశ్వర టెంపుల్, హొర్నాడులోని శారదాలయం...అక్కడి అన్నదానం, దర్జా నిండిన రాజా సీట్...ప్రతీదీ ఒక కొత్త అనుభూతిని, ఆనందాన్ని, విజ్ఞానాన్ని...కలిసికట్టుగా అందించాయి. ఇంకా బెంగుళూరు స్పెషల్ మైసూరు పాక్, కరకరలాడిన మద్దూరు వడ, నోరూరించిన నీరు దోశె, ఘుమఘుమలాడే కూర్గ్ కాఫీ ప్రయాణాన్ని సాఫీగా పూర్తిచేశాయి.



కావేరిలో నిసర్గధామం

సినిమా కబుర్లు

ఎవరి మాటా వినను

రాముడు, కృష్ణుడు పాత్రలకు ఎన్టీఆర్... దేవదాసు, విప్రనారాయణ పాత్రలకు ఏఎన్నార్ ఎలాగో... క్రీస్తు, సాయిబాబా పాత్రలకు విజయ్‌చందర్ అలా జీవం పోశారు. విజయ్‌చందర్ అంటే ఎవరో చాలామంది గుర్తుపట్టలేకపోవచ్చు. అదే 'కరుణామయుడు' విజయ్ చందర్... చిత్రంలో ఆయన పోషించి మెప్పించిన జీసస్ పాత్ర కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. నటుడు కావడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఓ దశలో రైలు కింద తల పెట్టి చనిపోదామన్న స్థితికొచ్చారు. 'కరుణామయుడు' తీస్తున్నప్పుడు పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న ఆటంకాలు, విడుదలప్పుడు పడ్డ ఇబ్బందులతో ఓ పుస్తకం రాయాలనుకుంటున్న విజయ్‌చందర్ అంతరంగాలు...



చందు

'ఆంధ్ర కేసరి' టంగుటూరి ప్రకాశంగారు, శ్రీరాములుగారు, జానకిరామయ్యగారు అన్నదమ్ములు. టంగుటూరి శ్రీరాములు మా తాతగారు. మద్రాసులో పుట్టాను. మాది జమీందారి కుటుంబం. రెండు మూడు వందల ఎకరాల భూమి ఉండేది. అమ్మ తనకున్న నగలన్నీ ధరిస్తే గూని వచ్చినట్లు వంగిపోయేది. నాన్నగారు రకరకాల వ్యాపారాలు చేయడంతోపాటు పేకాట ఆడేవారు. కాలంతోపాటే ఆస్తులన్నీ కరిగిపోయాయి. ఐదో క్లాస్ వరకూ స్కూలుకెళ్ళి చదువుకోవడం తెలీదు. ఇంట్లోనే చదువుకున్నాను. ఫస్ట్ ఫామ్‌లో స్కూల్లో చేరాను. చెన్నయ్, కాకినాడల్లో చదువు సాగింది. బి.ఏ వరకూ చదివాను.

దమ్ముంటే చూసుకుందాం... రా!

ఎంతైనా చదువు మీద శ్రద్ధ తక్కువే. స్నేహాలు, స్నేహితులెక్కువ. ముఖ్యంగా క్రిస్టియన్స్, ముస్లింలు, షెడ్యూల్ కులాల వారితో స్నేహం ఎక్కువ చేసేవాణ్ణి. గేదెలు కాసే వాళ్ళతో తిరిగేవాణ్ణి. ఈక్రమంలో ఐదు వరకూ స్కూలుకు వెళ్ళకుండా ఇంట్లోనే చదువుకున్నాను. అలాగే ఎవరితో పడితే వారితో దెబ్బలాడేవాణ్ణి. రౌడీ మూకలతో తిరిగేవాణ్ణి. చైన్స్‌తో కొట్టుకునేవాళ్లం. 'దమ్ముంటే చూసుకుందాం రా' అని కొట్లాటలకు కాలు దువ్వేవాళ్లం... మెచ్యూరిటీ లేని వయసు కదా! ఆ వయసులో మైండ్ ఆ పరిధి వరకే ఆలోచిస్తుంది. మానసికంగా అంతవరకే ఎదుగుతాం. వయసు అలాంటిది. నేడు ఇలాంటి సంఘటనలు చూసినా... విన్నా... ఎందుకిలా ఆలోచించకుండా చేస్తున్నారనిపిస్తుంటుంది. కానీ ఆ వయసులో మనమూ అలాగే చేశామని మరచిపోతాం.

కులం గురించి ఆలోచించను... పట్టించుకోను

లైఫ్‌లో కొన్ని సంఘటనలు బలమైన ముద్ర వేస్తాయి. మాది శాస్త్రోక్తమైన బ్రాహ్మణ కుటుంబ. నిష్టానియమాలతో ఉండేవారు. దానికి నేను రివర్స్. నా చిన్నప్పుడు దొడ్లు కడగడానికి ఓ అమ్మాయి వచ్చేది. ఆమె అచ్చం 'కీలుగుర్రం'లో అంజలీదేవిలా ఉండేది. నేనామెను అంజలీదేవి అంటూ పిలిచేవాణ్ణి. పండగ పబ్బం వచ్చిందంటే అందరూ ఇచ్చిన వంటకాలు, కూరలు, అన్నం తెచ్చుకునేది. చేయి జాపి 'నాకు పెట్టవా....' అనడిగేవాణ్ణి. పెద్దవాళ్ళు తమ చాదస్తాలతో తినొద్దనేవారు. మీ దగ్గరైతే ఒక్క వెరైటీయే ఉంటుంది. ఇక్కడైతే బోలెడన్ని వెరైటీలు తినొచ్చనేవాణ్ణి. కుల వ్యవస్థ తెలీని వయసది. నాన్నగారు కూడా కులం గురించి పట్టించుకునేవారు కాదు. నేనిప్పటికీ కులం గురించి ఆలోచించను...పట్టించుకోను.

ఎవ్వరికీ భయపడను

భయభక్తులు లేకుండా పోతున్నాడని నన్ను మామయ్య (రామ్మోహన్‌రావు) దగ్గర పెట్టారు. ఆయనే 'ఎ బి సి డి...'లు దిద్దించి చదువు చెప్పారు. పరీక్షలు ఇంకో నెల్లో ఉంటాయనగా... చదవడం మొదలుపెట్టేవాణ్ణి. ఎవరి మాటా వినకపోవడం... తోచిందే చేయడం.... నాకున్న సద్గుణమో దుర్గుణమో తెలీదు కానీ... ఎవ్వరికీ భయపడేవాణ్ణి కాదు. దీంతో నన్నొక చోట ఉంచేవారు కాదు. అటూ ఇటూ షిఫ్ట్ చేసేవారు.

నటన బ్లడ్‌లోనే ఉంది

నటన మా బ్లడ్‌లోనే ఉందని నమ్ముతాను. ఎందుకంటే మా తాత ప్రకాశంగారు నాటకాలు ఆడేవారు. ఆడ వేషధారణలో ఆయనకు చాలా పేరుంది. ప్రముఖ గాయని టంగుటూరి సూర్యకుమారి అత్తవుతుంది. చిత్తూరు



నాగయ్యగారితో కలిసి నటించింది. నారదుడిగా కూడా యాక్ట్ చేసింది. హిందీలో దిలీప్‌కుమార్‌తో కూడా నటించింది. పెళ్ళి చేసుకుని లండన్‌లో సెటిలైంది. మన పౌరాణిక నాటకాలను లండన్ చుట్టు పక్కల ఉన్న దేశాల్లోకి తీసుకెళ్ళి అక్కడున్న వారికి నేర్పించి వారితోనే చేయించింది. మూడు సంవత్సరాల క్రితం ఆమె చనిపోయింది. చనిపోయే ముందు వరకూ పౌరాణిక నాటకాలను విదేశాల్లో వ్యాప్తి చేసింది. అందుకే నటన మా బ్లడ్‌లోనే ఉందని నమ్ముతాను. మెక్లాన్ హైస్కూల్లో చదివేటప్పుడు తొలిసారి 'లోభి' అనే నాటకంలో నటించాను. టెన్త్ క్లాస్ పూర్తయ్యే వరకు పెద్దగా నాటకాలాడలేదు. కళాశాలలో ప్రవేశించాక మళ్ళీ స్టేజ్‌పై నటించడం మొదలుపెట్టాను.

'కృష్ణలా ఉన్నావే...!' 'శోభన్‌బాబులా ఉన్నావే...!'

నాతోపాటు నాటకాలు వేసిన రమణమూర్తి, హరనాథరాజు క్రమంగా హీరోలయ్యారు. వాళ్లు ఆజానుబాహుల్లా ఉండేవారు. అప్పట్లో నేను బక్కగా ఉండేవాణ్ణి. వాళ్ళతో పోల్చుకుని మనమెక్కడ హీరోలవుతామని భయపడి ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఆల్ ఇండియా ఎగ్జిబిషన్స్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగం వచ్చింది. నెలకు జీతం రూ. 270. ఇది 60వ దశకంలో అన్న మాట. ఇందులో ఎందుకు? ఇండియన్ ఎయిర్‌లైన్స్‌లో జాబ్ ఇప్పిస్తానని అంకుల్ అన్నారు. దీంతో మా ఇద్దరికీ చిన్నపాటి దెబ్బలాట. తన మాట వినడంలేదని మామయ్య ఇంట్లో కంప్లయింట్ చేశారు. ఈక్రమంలో మళ్ళీ షిఫ్టింగ్. పెద్ద మామయ్య టంగుటూరి గోపాలకృష్ణయ్యగారు ఎ.పి.పి.యస్.సి ఛైర్మన్‌గా ఉండేవారు. ఉద్యోగం ఇప్పిస్తానన్నారు. మామయ్య సర్వీస్ కమీషన్‌కు ఛైర్మన్ కదా... కలెక్టర్ లాంటి పెద్ద ఉద్యోగం ఇప్పిస్తారనుకున్నా. ముందుగా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లో నా పేరు రిజిస్టర్ చేయించమన్నారు. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పించారు. 73 రూపాయలతో ఉద్యోగ జీవితం ప్రారంభించా. ఇందులో పని చేస్తుండగానే... 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఒపీనియన్'లో ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకుని సెలెక్ట్ అయ్యా. 170 రూపాయలు పైబడి జీతం (1961లో). ఉద్యోగరీత్యా సూట్ వేసుకుని మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ ఛైర్మన్లను ఇంటర్వ్యూలు చేసే గొప్ప ఉద్యోగం. ఇందులో చేస్తుండగానే కొంతకాలానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో జాబ్ వచ్చింది. 'బ్యాంక్ ఉద్యోగం ఎవ్వరికీ రాదు. నీకొచ్చింది. ఆ ఉద్యోగం మానేసి ఇందులో చేరు' అని నాన్నగారు ఒత్తిడి చేశారు. ఈలోపు ఆర్మీ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో యు.డి.సి (అప్పర్ డివిజినల్ క్లర్క్) ఉద్యోగం వచ్చింది. 'జాబ్స్ తేలిగ్గా రావు. రావడం కష్టం' అని అందరూ అంటుంటే ఆశ్చర్యమేసేది. నేనెక్కడ అప్లయ్ చేసినా ఇట్టే జాబ్ వచ్చేది. నాన్న అభీష్టం మేరకు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్'లో జాయిన్ అయ్యాను. వాయిస్ స్ట్రాంగ్‌గా ఉండడంతో సమ్మెలప్పుడు అరవడానికి పనికొస్తానని బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ లీడర్ని చేశారు. మా వాళ్ళను ఇబ్బంది పెడుతున్నారని తెలిసి పై ఆఫీసర్లపై తిరగబడ్డాను. వీడిక్కడుంటే ఇబ్బందేననుకున్న ఆ ఆఫీసర్లు నన్ను ఉస్మానియా యూనివర్సిటీ శాఖకు బదిలీ చేశారు. బ్యాంక్‌లో పని చేస్తున్నప్పుడు సూపర్‌స్టార్ కృష్ణ సినిమా ఒకటి రిలీజైంది. 'నువ్వు కూడా అచ్చం కృష్ణలా ఉన్నావే' అనడం మొదలుపెట్టారు. కృష్ణ తొలి జేమ్స్‌బాండ్ సినిమా విడుదలైంది. ఆయనలా ఫోజులివ్వడం మొదలుపెట్టాను. 'డిటో కృష్ణ బ్రదర్‌లా ఉన్నావు... సినిమాల్లో ట్రై చేయొచ్చుగా..' అనేవారు. నన్ను నేను తెరపై చూసుకుందామని ఉద్యోగానికి రిజైన్ చేసి మద్రాస్ వెళ్ళిపోయా. ఎన్ని ఉద్యోగాలు చేసినా ఎక్కడా ఆరు నెలల కంటే ఎక్కువకాలం పని చేయలేదు.

'విజయచిత్ర' రమేష్, సుబ్బారావు, రామకృష్ణ ఓ సినిమా కంపెనీ పెట్టారు. ఇంటర్వ్యూలు చేస్తున్నారు. నేనూ వెళ్ళాను. 'శోభన్‌బాబులా ఉన్నావే! నిన్ను సెలెక్ట్ చేస్తున్నాం. కాకపోతే నీ పేరు మారుస్తున్నాం. నీ అసలు పేరు 'రామ్‌చందర్' కదా! మా సంస్థ పరిచయం చేస్తోంది కాబట్టి ఇవాళ్టి నుంచి నీ పేరు 'విజయ్‌చందర్'' అన్నారు. నన్ను సెలెక్ట్ చేసిన వాళ్ళేమో సినిమాలు తీయడం లేదు. ఇతరత్రా ప్రయత్నాలు ఫలించ లేదు. 'బుద్ధిమంతుడు' సినిమాకు సరదాగా ప్రొడక్షన్ పనులు చూసేవాణ్ణి. అలాగే సరదాగా ఆ చిత్రంలో ఏఎన్నార్ ఫ్రెండ్ వేషం వేశాను. ఆయనను గురువుగా భావిస్తాను. ఆయనకు ఏకలవ్య శిష్యుణ్ణి. ఆదుర్తి సుబ్బారావుగారికి, కె. విశ్వనాథ్‌గారికి నన్ను ఆయనే పరిచయం చేసి ప్రోత్సహించారు.

మంచి రైజింగ్ హ్యాండ్

ప్రయత్నాలు ఎంతకీ సఫలం కాకపోయేసరికి... వేషాలు ఇవ్వడం లేదని నేనే సినిమాలు తీయడం మొదలు పెట్టాను. భావన్నారాయణగారి దగ్గర ఎడిటర్‌గా పనిచేస్తున్న కె.యస్.ఆర్. దాస్‌కు దర్శకునిగా అవకాశమిచ్చాం. 50 రూపాయలు అడ్వాన్స్ కూడా ఇచ్చాం. 'దారి తప్పిన డాక్టర్' అనే స్క్రిప్ట్ తయారు చేసుకున్నాం. రామకృష్ణను హీరోగా, కె.యస్. రెడ్డిని మ్యూజిక్ డైరెక్టర్‌గా తీసుకున్నాం. ఆఫీసు కింద రెండు రూములు తీసుకున్నా. ఒక రూంలో వీళ్ళతో పేకాట ఆడేవాణ్ణి. రోజుకు రెండొందలు గెలవడం... వాళ్ళకే అడ్వాన్సులివ్వడం. హ్యాండ్ మంచి రైజింగ్‌లో ఉండేది. అయినా సినిమా తీయడం మాటలు కాదు కదా! సినిమా తెరపైకి రాకుండానే ఆగిపోయింది.

మే 24న నా పుట్టిన రోజు. ఆ రోజు లోగా హీరో కాకపోతే రైలు కింద తల పెట్టి చనిపోదామనుకున్నాను. మే 9న ఫోన్ వచ్చింది. ఆదుర్తి సుబ్బారావుగారి 'మరో ప్రపంచం' సినిమాలో వేషముందని పిలిచారు. అందులో జర్నలిస్టు పాత్ర పోషించాను. గడ్డం పెట్టుకుని మారు వేషం సీన్‌లో నటిస్తుంటే... 'వీడు అచ్చం క్రీస్తులా ఉన్నాడండి...' అని ఆదుర్తి సుబ్బారావుగారు, కె. విశ్వనాథ్‌గారు అనుకున్నారు. ఆ తర్వాత 'రౌడీ రాణి', 'కేడీ రాజు', 'మా ఊరి మొనగాళ్ళు' చిత్రాల్లో నటించాను. 'మరో ప్రపంచం', 'రౌడీ రాణి' గుర్తింపు తీసుకొచ్చాయి.

(మరిన్ని విశేషాలు పై వారం)



మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

ఫోన్ నెం:9390044031

సమయపాలన ఎలా!

నేను పదో తరగతి చదువుతున్నాను. నాలక్ష్యం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం. నేను బాగానే చదువుతాను. కానీ టైమ్ మెయింటైన్ చేయలేకపోతున్నాను. నేను పదవ తరగతిలో 520 మార్కులు పైనే సంపాదిస్తాననే నమ్మకం ఉంది. ముఖ్యంగా గణితంలో సూత్రాలు, ముఖ్యమైన బిట్స్, లెక్కలు మొదలైనవి, మరియు ఇంగ్లీష్ గ్రామర్ పాయింట్స్, సమయపాలన ఎలాగో తెలుపగలరని నాకోరిక.

రాజగోపాల్, అవనిగడ్డ.

నీ లక్ష్యాన్ని చక్కగా ఏర్పరుచుకున్నావు. కానీ పనులు దాట వేయకు. ఎ.బి.సి లిస్టు తయారు చేసుకోండి. మీరు ఇవాళే పూర్తి చేయాల్సిన పనులను 'ఎ' లిస్టులో చేర్చండి. తరువాత చేయాల్సినవి ' బి ' లిస్టులోనూ, ఇంకా మిగిలినవి ' సి 'లిస్టులో చేర్చండి. పనులన్నింటిని ఆర్డర్‌లోనే చేద్దామని గట్టిగా అనుకుంటాం. కానీ ఆచరణలోకి వచ్చేటప్పటికి పూర్తి వ్యతిరేకంగా చేస్తుంటాం. దాంతో క్రమం తప్పి భారం పెరుగుతుంది.కానీ నువ్వు అనుకున్న లిస్టు ప్రకారం సమయానికి తగిన విధంగా చేయటం వల్ల చదవాల్సిన సమయంలో ఒత్తిడి తగ్గుతుంది. గణితంలో సూత్రాలూ, బిట్స్, ఒక పుస్తకం పెట్టుకుని అందులో రాయి. ఖాళీ ఉన్నప్పుడల్లా వాటిని చూస్తుండు. ఇంగ్లీష్ గ్రామర్‌కు ప్రతి రోజు 10 నిమిషాల సమయాన్ని కేటాయిస్తే చాలు. వీటన్నిటి పట్ల బాధ్యతగా వ్యవహరిస్తే నువ్వు అనుకున్న దానికన్నా మంచి ఫలితాలను పొందవచ్చు.

టీచర్ అవ్వాలంటే...

నేను అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బి.ఎస్.సి (ఎం.పి.సి) తెలుగు మీడియం చదువుతున్నాను. నాకు టీచర్ లేదా లెక్చరర్ అవ్వాలని ఉంది. నాకు మాథ్స్, ఇంగ్లీష్ అంటే చాలా ఇష్టం. ప్రస్తుత కాలంలో ఏ ఉద్యోగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది? టీచర్ అవ్వాలంటే ఏం చేయాలి. ఎలా చదవాలి? వీటి గురించి మంచి సలహా ఇవ్వగలరు.

రాములు, విజయవాడ.

మీకు మాథ్స్, ఇంగ్లీష్ అంటే ఇష్టం అంటున్నారు కాబట్టి బిఇడిలో మాథ్స్ సబ్జెక్ట్ తీసుకుని చదవండి. ఈ రోజుల్లో మాథ్స్‌కి మంచి డిమాండ్ ఉంది. ఇప్పటినుంచే బిఇడి ఎంట్రన్స్‌కి ప్రిపేర్ అవ్వండి. ఎంట్రన్స్‌లో మంచి ర్యాంక్ వస్తే మీరు కోరుకుంటున్న కాలేజీలో సీటు వస్తుంది. పూర్తి చేసిన తర్వాత మీరు అనుకున్న విధంగా టీచర్ జాబ్ చేయగలరు. ఎం.ఇడి చేస్తే లెక్చరర్ కూడా అవ్వొచ్చు. కాబట్టి ఇప్పటి నుంచే మీ లక్ష్యానికి చేరుకునేలా చదవండి. సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకోండి. మీరు భవిష్యత్తులో గొప్ప లెక్చరర్ అయినట్లు చక్కగా పాఠాలను బోధిస్తున్నట్లు అప్పుడప్పుడు ఊహించుకోండి. మీ లక్ష్యాన్ని ఎప్పుడూ గుర్తుచేసుకుంటూ ఉండండి. ప్రతి రోజూ మీరు ఏం చేస్తున్నారు, ఎలా ప్రవర్తిస్తున్నారు, ఎలా

చదువుతున్నారో పరిశీలించుకోండి. మీ లక్ష్యానికి తగిన విధంగా మిమ్మల్ని మలచుకోండి.

అభిమానమా? అనుమానమా?

సార్ నేను బి.కామ్ రెండవ సంవత్సరం చదువుతున్నాను. నాకు చదువు అంటే చాలా ఇష్టం. నేను బాగా చదువుకోవాలని అనుకుంటున్నాను. మా బావగారి (అక్క భర్త) ప్రోత్సాహం ఉంది. ఒకరోజు ట్యూషన్ అని చెప్పి షాపింగ్‌కి వెళ్లాను. అది తెలిసి నన్ను జాగ్రత్తగా ఉండు అని మందలించారు. నీకు ఇబ్బంది రాకూడదనే నేను సలహాలు, జాగ్రత్తలు చెప్తున్నానన్నారు. ఇంతకూ ఆయన నా మీద చూపిస్తున్నది ప్రేమతో కూడిన స్నేహమా! లేక అభిమానమా? అనుమానమా? నాకు చదువు మీద ధ్యాస ఉండటంలేదు. నాకు తగిన సలహా ఇచ్చి పరిష్కారం చెప్పగలరని ఆశిస్తున్నాను.

సరోజ, కాకినాడ.

టీనేజ్‌లో ముప్పిరిగొలిపే ఆలోచనలు ఎంత కలగాపులగంగా ఉంటాయో , పెద్దవారు చెప్పే మార్గదర్శక సూత్రాలు కూడా అంతే గందరగోళాన్ని సృష్టిస్తాయి. చివరకు మార్గదర్శక సూత్రం ఏమిటో తెలియక, తేల్చుకోలేక టీనేజ్ పిల్లలు ఇబ్బందులు పడుతుంటారు. మీ ఆలోచనలు కూడా అటువంటివే. ఈ రోజుల్లో బయట ఆడపిల్లల పరిస్థితి దారుణంగా ఉండటం వల్ల మీ బావగారు నీ మంచి కోసమే ఎక్కువ జాగ్రత్తలు చెపుతున్నారు. నీవు వాళ్ల ఇంట్లో ఉంటున్నావో, వాళ్లు మీఇంట్లో ఉంటున్నారో తెలియజేయలేదు. నీవు బాగా చదవాలనే కదా నిన్ను చక్కగా ప్రోత్సహిస్తున్నారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా నిజాయితీగా ఉండు. ఎలాంటి విషయాన్నైనా సవినయంగా తెలియజేయి. బావగారు ఏదో అన్నారని మనసులో పెట్టుకుని బాధపడటం వల్ల సరిగ్గా చదవలేవు. అప్పుడు ఇంకా సమస్యలు పెరుగుతాయి. వాళ్లన్న మాటలను తేలికగా తీసుకుంటూ నీ దృష్టి అంతా చదువు మీదపెట్టు. నీవు బాగా చదువుతుంటే పెద్దవాళ్లకు నీ మీద నమ్మకం పెరిగి అతి జాగ్రత్తలు చెప్పడం తగ్గిస్తారు. ముందు పెద్దవాళ్లను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. ఉద్వేగాలకు తావివ్వకుండా మీ జీవితానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను మీరు తీసుకోగలరన్న నమ్మకాన్ని కల్గించండి.



కొత్త పుస్తకాలు

చదివించే కథలు

ఇప్పుడు కథలుగా పిల్చుకొనేవన్నీ "కథానికలుగా" పేర్కొంటున్నారు కొందరు పరిశోధకులు. "ప్రతి కథానిక కథేనని, అయితే ప్రతి కథ, కథానిక కాదని" ప్రముఖ కథారచయిత, కథలపై విస్తృత పరిశోధన చేసిన డా॥ పోరంకి దక్షిణా మూర్తి అభిప్రాయపడుతున్నారు. 1910లో ఆంధ్ర భారతిలో ప్రచురణైన గురజాడ వారి "దిద్దుబాటు" తొలి కథగా ప్రమాణీకరింపబడి దాదాపు వందేళ్లు కావస్తోంది. శత వార్షికోత్సవం జరుపుకొంటున్న కథా ప్రక్రియపై నేడు చాలామంది రచయితలు కథలు, పత్రికల్లోనూ... విడివిడిగా సంపుటాల్లోనూ, ప్రత్యేక సంచికల్లోనూ, విరివిగా రాస్తున్నారు.

రచయిత : నాగభూషణా చార్యులు
పేజీలు: 151,
వెల : 60 రూ॥
ప్రతులకు : నాగభూషణా చార్యులు, 3-ఎ-5-13, రైల్వే గూడ్స్ షెడ్‌రోడ్, పాలకొల్లు- 534260, ప. గో. జిల్లా,
మరియు విశాలాంధ్ర, ప్రజాశక్తి , మైత్రి, నవోదయ బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి పాక్షిక ఆర్థిక సహాయంతో "జవాబు రేపిన ప్రశ్నలు" కథా సంపుటిని నీలా వెంకట సత్య నాగభూషణాచార్యులు వెలువరించారు. పదహారు కళలు... అన్నట్లుగానే దాదాపు 16 కథలు ఎంపిక చేసి ప్రచురించారు. విశాలాంధ్ర, నవ్య, సుప్రభాతం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ప్రస్థానం, వార్త, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి లాంటి పత్రికల్లో ప్రచురణ పొందిన కథల సమాహారమే ఈ సంపుటి. కొన్ని కథలకు రచయిత ఆంగ్ల టైటిల్స్ పెట్టారు."ది ఇంటర్వ్యూ"(పేజీ.145), "ట్రాన్స్‌ఫర్" (పేజీ .74). ఇక చాలా కథల్లో ఆంగ్ల పదాలు... విరివిగా చోటు చేసుకున్నాయి. తెలుగు... తెలుగు నుడికారం, ప్రాచీన హోదా కావాలి అని కవులుగా సర్కార్‌పై డిమాండ్‌లు పెడుతూ... మనమే ఆంగ్లాన్ని నెత్తికెత్తుకోవడమెందుకు?? బక్క రైతులు... వలస కూలీలుగా మారే వైనం.... చేపల చెరువు, కొల్లేటి ఆక్రమణలు... "అమ్మిరాజు" లాంటి భూకామందులు... పేరుకే పదవి. పెత్తనం భూస్వామిదిగా సాగే గ్రామీణ పంచాయితీ వ్యవస్థ. కొల్లేటి ప్రాంతంలో ఆక్రమణగా నిర్మించిన చెరువుల్ని తొలగింపు ... సమస్యలపై "జవాబు రేపిన ప్రశ్నలు" కథ చాలా బాగుంది. అభ్యుదయ భావాలున్న చలపతి లాంటి ఉపాధ్యాయుణ్ణి, స్కూల్ హెచ్.ఎం. వేధింపులు... అడ్డుపడటం... లాంటి చర్యలు... "కుర్చీస్వామ్యం" కథల్లో రచయిత బాగా చెప్పారు. "ఇటువైపు"(పేజీ.136) కథ ... 'లేఖా' కథనంగానే సాగింది. అదేరీతిన (లేఖా కథనంలా సాగిన) " అక్కా .... నన్ను క్షమించవూ?" పాఠకుణ్ణి చదివిస్తుంది.

"ఏమిటి నా స్థానం వేకెంట్ అయింది... మీరు త్వరగా... ట్రై చేయకపోతే త్వరలోనే డిపార్ట్‌మెంట్ ప్రమోషన్లు రాబోతున్నాయట... వేకెన్సీ ఫిల్ అయిపోతే... మళ్లీ కష్టం" హెచ్చరించాడు(పేజీ.79). ట్రాన్స్‌ఫర్ కథలో టీచర్లు, ఉద్యోగాలు, ప్రమోషన్లు, మధ్య తరగతి ప్రజల మనస్థత్వాలు, చలా కథల్లోని సారాంశంగా ఉంది. నేటి ప్రపంచీకరణ పీడనంలో ఎక్కువగా బాధలకు గురయ్యే వర్గాలు... అట్టడుగు గ్రామీణ, వ్యవసాయ రైతాంగ పేద ప్రజలు కోస్తాసీమలో.... 'సెజ్'ల పేరుతో 'కోస్తా కారిడార్' ఏర్పాటు సన్నాహాలు... శ్రామిక వర్గం తిరుగుబాట్లు.... గ్రామీణ భూస్వాముల ఆగడాలు.... ఆకృత్యాలు... వస్త్రవ్యాపారం, రైతాంగ సమస్యలు. ఇలా ఎన్నో సమస్యలపై 'కథలు' నాగభూషణాచార్యులు కలం రాబోయే కాలంలో అందించాలని ఆశిస్తూ.... పాఠకుణ్ని చదివించి... ఆలోచింప జేసే గుణం వీరి నిర్మాణ శైలిలో ఉంది అని అభినందిస్తూ మరిన్ని మంచి కథలు రాయాలని కోరుతున్నాను.

తంగిరాల చక్రవర్తి



అమర జీవి పొట్టి శ్రీరాములు
సంక్షిప్త జీవిత పరిచయం
అల్లెన వెంకట జనార్దన రావు
వెల : 25/-
పేజీలు :67
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 4-1-435, విజ్ఞాన భవన్, బ్యాంకు స్ట్రీట్, హైదరాబాద్.
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు



మహనీయుల జీవితాల్లోని
రసవద్ఘట్టాలు
డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి
వెల :35/-
పేజీలు: 107
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.
విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు



క్రైమ్ కథ

ప్రత్యక్ష సాక్షి



యర్నాగుల సుధాకరరావు

రైల్వేస్టేషన్‌లో నైట్ ఎక్స్‌ప్రెస్‌లో దిగిన ప్యాసింజర్లు ఆదారిలో రకరకాల వాహనాల్లో వెళ్లిపోయారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న రిక్షాను తప్పిస్తూ కార్లు జీపులు సాగిపోగా ఒక అంబాసిడర్ మాత్రం రిక్షాను బలంగా ఢీకొంది. రిక్షా నింగిలోకి లేచినట్లు లేచిపోయి తలకిందులుగా పడిపోయింది. అందులో తీవ్రగాయాలపాలైన వ్యక్తి రోడ్డుమీద అడ్డదిడ్డంగా పడిపోయాడు. అంబాసిడర్ ఆగింది. డ్రయివర్ వచ్చి నేల మీద పడున్న వ్యక్తిని చూసి 'బాప్‌రే చచ్చినట్టున్నాడు. రిక్షాకు గుద్దితే వీడు ఇంతగా గాయపడి క్షణాల్లో రక్తంతో ఇలా తడిసిపోయాడేంటి? ఇదెలా సాధ్యం?' అని అటు ఇటు కదిపాడు. ఇంకా నాడి కొట్టుకుంటోంది. ఏమి పాలుపోక సెల్ తీసి పోలీసులకు చెప్పాడు. క్షణాల్లో పెట్రోలింగ్‌వాన్ వచ్చింది. ఇన్‌స్పెక్టర్ రోడ్డుమీద పడున్న వ్యక్తిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. అంబాసిడర్ డ్రయివర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అక్కడ రిక్షావాడికోసం గాలించారు. బహుశా వాడు యాక్సిడెంటు చూసి పారిపోయి ఉంటాడనుకుని వాడెవడో వెతికి రాణాకు తీసుకురమ్మని ఇద్దరు కానిస్టేబుల్సును అక్కడే వదిలి వాన్ ఎక్కాడు ఇన్‌స్పెక్టర్. రిక్షావాడికోసం తెల్లవార్లు వెతికారు. ఎక్కడా వాడి ఆచూకీ లభించలేదు. వేకువజామున హాస్పిటల్‌లో చికిత్స పొందుతూనే ప్రాణాలు వదిలాడు గాయపడిన వ్యక్తి. పొట్టలో కత్తిపోటు గాయమే అతడి ప్రాణం తీసిందని డాక్టర్లు తెలిపారు. విషయం విన్న ఇన్‌స్పెక్టర్ అయోమయంగా డాక్టర్లను వారు తయారుచేసిన రిపోర్టు చూశాడు.

"డాక్టర్ మేము తెచ్చింది యాక్సిడెంటు కేసు. మీరు కత్తిపోట్లు అంటున్నారు. ఇదెలా సాధ్యం? మీరు వేరెవరిదో రిపోర్టు మాకు పొరపాటున ఇచ్చినట్టున్నారు.రాత్రి మేము ఒక యాక్సిడెంటు కేసు తీసుకువచ్చాం. రిక్షాలో ఉన్నవాడిని ఒక అంబాసిడర్ బలంగా ఢీకొట్టింది. అంతకుమించి ఏమీలేదు. మీరు హత్యాప్రయత్నంలా చెబుతున్నారు ఇందులో కత్తిపోట్లకు ఆస్కారంలేదు"

"అవును. రాత్రి ఆసుపత్రికి వచ్చిన ఏకైక కేసు మీదే. రిక్షాలో ఉన్న వ్యక్తికి ఎనిమిదిచోట్ల కత్తిపోట్లు ఉన్నాయి. అవన్నీ రక్తం చిందించేవే. కానీ, పొట్టలో అయిన గాయం అతడికి తీవ్రరక్తస్రావంతో బాటు ప్రాణాలమీదకు తెచ్చింది. సరైన సమయానికి తీసుకుని రాగలిగితే అతను బతికే అవకాశం ఉండేది" ఒక డాక్టర్ తేల్చిచెప్పాడు. ఇన్‌స్పెక్టర్‌కు తల తిరిగిపోయింది. రిక్షావాలాను పట్టుకుంటే తప్ప అసలు విషయం బయటికి రాదని వెంటనే ఆ వెదుకులాటలో పడ్డాడు. రెండురోజులైంది. అప్పటికే హతుడి తరపు బంధువులు పత్రికల్లో వార్తలు చూసి వచ్చి వివరాలు అందించారు. అతడి పేరు చమన్‌రాజ్(40) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి శత్రువులు చాలామంది ఉన్నారు. నాలుగైదుసార్లు అతడిపై హత్యాప్రయత్నం జరిగింది. అతడు నాగ్‌పూర్ వాసి. ఇక్కడ ఎవరిని కలవడానికి వచ్చాడో తెలియదు. అతడు డబ్బు నీళ్లలా ఖర్చు చేస్తాడు.ఇలా రిక్షాలు ఎక్కాల్సిందిలేదు.టాక్సీలో వెడతాడు" అని వారు చెప్పారు. ఇంతకు మించి చమన్‌రాజ్ హత్య వెనుక వివరాలు పోలీసులవద్ద లేనేలేవు. వారంరోజులైంది. ఎక్కడి గొంగళి అక్కడే ఉంది. చమన్ రాజ్ హత్యపై అతడి బంధువుల ఒత్తిడి ఎక్కువ కావడంతో పోలీసులు మరింత చురుగ్గా కదిలారు. ఇన్‌స్పెక్టర్ పట్టణంలో ఉన్న రిక్షావాలాలందరిని పిలిచి విరిగి పోయిన రిక్షాను చూపించి దాన్ని నడిపే రిక్షావాలా ఎవరైంది చెప్పమని కోరాడు.వారు కూడబలుక్కున్నట్లుగా అంతా ఒకేలా చెప్పారు. రాత్రి వేళల్లో రిక్షా వేసేవారు ఎక్కువగా ఆరాత్రి గడిస్తే చాలు అనుకునే వారే. నిత్యం పదిపదిహేను మంది వరకు రాత్రి డ్యూటీ చేస్తారు. వారిని మీరు ప్రశ్నించారు. "కొత్తవారు చాలామంది రిక్షాలు వేస్తుంటారు. వారు ఒకటిరెండు రోజులు వేసి పత్తాలేకుండా పోతుంటారు. వారెవ్వరనేది చెప్పడం చాలా కష్టం" అని వివరించారు.

ఇన్‌స్పెక్టర్ చివరిప్రయత్నంగా మరికొద్ది మందిని ప్రశ్నించాడు. ఏ చిన్న ఆధారం లభించలేదు. రిక్షావాడు కన్పించకుండా పోవడంలో ఏదో క్లూ దాగి ఉందనే కాన్సెప్టుతో అన్ని దారులు వెతికాడు. ఏమైఉంటాడు? రిక్షాను కారు ఢీకొట్టినపుడు స్పాట్‌లో రిక్షావాడు లేడని చెబుతున్నాడు కారు డ్రయివర్. సమీపంలో ఎక్కడో ఉండిఉంటాడు. అతను దొరికితే తప్ప కేసు ముడి వీడదు. యాక్సిడెంటు చూసి ఎక్కడికైనా పారిపోయి ఉండొచ్చు లేక భయపడి జ్వరం తెచ్చుకుని ఉండొచ్చు. రిక్షాలో ఎవరో చమన్‌లాల్‌ను పొడవడం తర్వాత కారు ఢీకొట్టడం ఇవన్నీ చూసి భయపడి ఉంటాడు. చివరి ప్రయత్నంగా ధర్మాసుపత్రికి వెళ్లి ఆరా తీశాడు. వారం రోజులుగా ఔట్ పేషెంట్ల లిస్టు వార్డుల్లో చేరినవారి వివరాలు అడిగి తీసుకున్నాడు. ఆసుపత్రి సూపరింటెండెంటు రోగులు వివరాలు చెప్పాడు. అందులో ఒక బెడ్‌మీదఉన్న వ్యక్తిని చూపించి దయ్యాన్ని చూసి భయపడి జ్వరం తెచ్చుకున్నాడని చెప్పి పకపకమని నవ్వాడు. వాడిపేరు రాజు(31). ఇన్‌స్పెక్టర్ నేరుగా బెడ్‌వద్దకు వెళ్లాడు. మాసిన గడ్డంతో, పీక్కుపోయిన కళ్లతో, చినిగిన దుస్తుల మాటున ఉన్న రాజును చూశాడు. అప్పటివరకు కళ్లువిప్పి ఏదో ఆలోచించుకుంటున్న రాజు ఇన్‌స్పెక్టర్‌ను భయంగా చూసి కళ్లు మూసేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ తన వెనుకనే వచ్చిన కానిస్టేబుల్ లాఠీతో రాజును తట్టిలేపాడు. గాఢనిద్రలో ఉన్నట్టు నటిస్తుంటే "రేయ్ పడుకున్నవాడిని లేపవచ్చు. ఇలా నటించేవాడిని ఈ లాఠీ లేపుతుంది" ఒక పోటు పొడిచాడు.భయంతో కళ్లువిప్పి చేతులు జోడించాడు రాజు.

"నీవు దయ్యాన్ని చూశావా లేక నీ రిక్షాలో వ్యక్తిని చంపే హంతకుల్ని చూశావా? దాచకుండా చెబితే నిన్ను ఏమిచేయను. లేకుంటే చావగొట్టి నిజం కక్కిస్తాను" సూటిగా అడిగేసరికి హడలెత్తిపోయాడు.

"ఆరోజురాత్రి నేను బేరాలు లేక రోడ్లకూడలిలో ఉన్నప్పుడు ఒకతను నెత్తురు స్నానంచేసినట్లు వచ్చి నా రిక్షాలో దూరిపోయి నాకు రెండు వేలు రూపాయలిచ్చి ఎదురు సందులోకి పారిపొమ్మన్నాడు. అలా ఎందుకు పారిపొమ్మన్నాడో తెలియదు. నాదుప్పటి లాక్కుని కప్పుకుని ముడుచుకుని రిక్షాలో పడుకున్నాడు. నాకు నోట మాటరాలేదు.రక్తం చూసి భయపడి పరుగెత్తాను. కొంతదూరం వెళ్లాక నావెంట ఎవరో తరుముకొస్తున్నారు. రిక్షాలో దూరినవాడు ఎందుకు పరుగెత్తమన్నాడో అప్పుడు తెలిసింది. మరింత భయంవేసి నాలుగు వీధులు అంటే నాలుగు కిలోమీటర్లు దాటాక పరుగెత్తలేక ఆగిపోయాను. అప్పుడు వెనుకఉన్నవారు వచ్చి చుట్టుముట్టి కత్తులతో నిలబడి, నన్ను ఎగాదిగాచూసి వాడు తప్పించుకున్నాడు. వీడెవడో మన కత్తుల్ని చూసి బెదిరి పరుగెత్తితే వీడి వెంట పడ్డాం అని వెనుదిరిగి పోయారు. ఆరాత్రి నేను చూసింది ఈఊరిగూండాల్నే అని వారిపేర్లు చెప్పాడు.

"ఆతరువాత నేను తిరిగి నడుచుకుంటూ నారిక్షా వద్దకు వెళ్లేసరికి రిక్షాలోంచి ఆగాయపడినవాడు చలికి గాయాలసలుపుకు రక్షించమని అరుస్తున్నాడు. నాకు ఆరక్తం, ఆకేకలు విన్నాక భయం వేసింది. ఒకమూల బిగుసుకుపోయాను. కొంతసేపు అరిచాక రిక్షాలో శబ్దం ఆగిపోయింది. వాడు చచ్చాడనుకున్నాను. ఈలోగా కారు వచ్చి ఢీకొట్టింది. దాంతో నేను పరుగెత్తాను. ఇంటికి చేరేసరికి నాకు జ్వరం వచ్చింది. నాభార్య ఆసుపత్రిలో చేర్పించింది" ఏది దాచకుండా చెప్పాడు. పోలీసులు కొన్ని గంటల్లో హంతకుల్ని అదుపులోకి తీసుకున్నారు. చమన్‌రాజ్ హత్య ముడి ఇలా వీడిపోయింది.

✠




వెరైటీగా...



'ఇల్లు' అన్న వెంటనే మనకు ఏం స్ఫురిస్తుంది? చక్కగా చదునుగా వున్న నేల మీద పొందికగా కట్టిన నివాసం గుర్తొస్తుంది. అయితే ఇక్కడ నీళ్లల్లో, చెట్లమీద, మంచులో, కొండలమీద...వంకరటింకరగా దర్శనమిస్తున్న కట్టడాలు చూస్తుంటే ఏమనిపిస్తోంది?! 'ఏవో దర్శనీయ స్థలాలై వుంటాయి [illegible]కుంటున్నారా! అలాగైతే తప్పులో కాలేసినట్టే. ఇవన్నీ నివాసం కోసం ఏర్పాటుచేసుకున్నవేనండీ బాబూ. ఏదో కాస్త డబ్బు ఎక్కువైనోళ్లు వెరైటీ కోసం వీటిని కట్టుకున్నారంతే.

OK

షుగరు వ్యాధిగ్రస్తులకు శుభవార్త !

ఎస్ ఎస్ ఫార్మా అందిస్తున్న

జీరో కేలరీ సుక్రోజ్ బిస్కట్స్

అధిక పీచుపదార్థం గల ఆటా

- అధిక పీచు పదార్థం వల్ల మలబద్ధకాన్ని నివారిస్తుంది.
- రక్తంలో చక్కెరను నియంత్రించి అతిమూత్రమును, దాహాన్ని తగ్గిస్తుంది.
- మధుమేహం వల్ల కలిగే అధిక ఆకలిని, నీరసాన్ని తగ్గిస్తుంది.
- రక్తంలోకి చెడు కొలెస్ట్రాల్ చేరకుండా సహాయపడుతుంది.

S.S. Pharma Mobile: 9989057383 www.diafoods.com